ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు




సోమవారం 19 ఆగస్టు 2024



బదిలీల.. సందడి

- నేటి నుంచి అమల్లోకి ప్రక్రియ
- కోరుకున్న చోటు కోసం జోరుగా పైరవీలు
- ఎమ్మెల్యేల ఆశీస్సులు ఉంటేనే పోస్టింగ్‌లని ప్రచారం
- కూటమి నేతల ద్వారా లేఖల కోసం ఉద్యోగుల ప్రయత్నాలు
- కొందరు ఎమ్మెల్యేలు ఇప్పటికే భారీగా లేఖలు జారీ చేసినట్లు సమాచారం
- వైసీపీతో అంటకాగిన వారి జాబితాలు సిద్ధం చేస్తున్న టీడీపీ నేతలు



కూటమి అధికారం చేపట్టి రెండు నెలలు దాటగా.. బదిలీలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇప్పటికే ఐఏఎస్, ఐపీఎస్‌లతో పాటు కొన్ని స్టేషన్లలో డీఎస్పీ, సీఐ, ఎస్ఐల స్థాయి వరకు బదిలీలు చేసింది. ఈ క్రమం లో అందరూ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తోన్న మిగిలిన ప్రభుత్వ శాఖల్లో వివిధ స్థాయిల్లోని ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం సిద్ధమైంది. బదిలీలకు సంబం ధించి మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసిం ది. ఈ నెల చివరి వరకు కూడా బదిలీలపై నిషేధాన్ని ప్రభుత్వం తొలగించింది. దీంతో సోమవారం నుంచి బదిలీల సందడి మొదలుకానున్నది. 15 శాఖల్లో అధికారులు, ఉద్యోగుల బదిలీలు జరగ నున్నాయి. బదిలీలకు ఎమ్మెల్యేల లేఖ తప్పని సరి అన్న ప్రచారంతో ఆయా శాఖల అధికారులు, ఉద్యోగులు ఎవరిస్థాయిలో వారు ప్రయ త్నాలు మొదలుపెట్టారు. ఇప్పటికే కొందరు ఎమ్మెల్యేలు కొందరికి సిఫార్సు లేఖలు ఇవ్వగా మిగిలిన వారు కూటమి నేతల ద్వారా ఎమ్మెల్యేలపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నాల్లో నిమగ్నమ య్యారు. అదేవిధంగా గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నేతలతో అంటకాగి వారు చెప్పి నట్లు చేసి.. వారి అక్రమాలకు సహకరించిన అధికారులు, ఉద్యోగుల జాబితాలను టీడీపీ నేతలు సిద్ధం చేసి బదిలీల్లో వారికి ప్రాధాన్యం లేకుండా చేసేందుకు సిద్ధమవుతున్నారని తెలిసింది.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

వైసీపీ ఓడిపోయింది.. కూటమికి ప్రజలు అధికారం ఇచ్చారు.. చంద్రబాబు ముఖ్యమంత్రిగా రెండు నెలల క్రితం బాధ్యతలు చేపట్టారు. వైసీపీ ప్రభుత్వంలో కొందరు అధికారులు, ఉద్యోగుల తీరుతో పలువురు ఇబ్బందులు పడ్డారు. ఈ పరిస్థితుల్లో అలా ఇబ్బందులు పడిన వారితో పాటు కూటమి నేతలు కూడా అధికారులు, ఉద్యోగుల బదిలీ కోసం ఎదురుచూస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఎట్టకేలకు ప్రభుత్వం బదిలీల ప్రక్రియను సోమవారం నుంచి అమలు చేయాలని నిర్ణయించింది. ఈ క్రమంలో ఈ నెల 31 వరకు బదిలీల ప్రక్రియ జరగనున్నది. దీంతో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో బదిలీలకు రంగం సిద్ధమైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలోనే బదిలీలు ఉంటాయని ఉద్యోగులు, అధికారులు భావించారు. అయితే ప్రభుత్వం కుదురుకున్న తర్వాత కింది స్థాయిలో బదిలీలు ప్రక్రియ మొదలు పెట్టాలని పాలకులు నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే రెండు నెలల తర్వాత బదిలీల ప్రక్రియకు ప్రభుత్వం ఆమోదం తెలిపి మార్గదర్శకాలను జారీ చేసింది. ఎన్నికల విధుల్లో భాగంగా ఇతర జిల్లాలకు వెళ్లిన తహసీల్దార్లు ఇప్పటికే జిల్లాలకు రాగా వారికి పోస్టింగ్‌లు ఇచ్చారు. రెవెన్యూ శాఖలో డీటీ, ఆర్ఐలు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, వీఆర్వోల బదిలీలు మిగిలాయి. వీఆర్వోల సంఖ్య వందల్లోనే ఉంది. పొరుగు జిల్లాలకు వెళ్లిన ఎంపీడీవోలు ఇటీవలే జిల్లాలకు చేరుకున్నారు. వివిధ మండలాలకు వారిని కేటాయించగా వారు విధుల్లో చేరారు. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో ఐదేళ్ల సర్వీసు పూర్తయిన వారి సంఖ్య ఎక్కువగానే ఉంది. వీరందరికీ స్థానచలనాలు తప్పేలా లేవు. గ్రామాల్లో కీలకంగా వ్యవహరించే వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శుల బదిలీలపై గ్రామ స్థాయిలో టీడీపీ నేతలు ప్రత్యేక దృష్టి సారించారు. వైసీపీతో అంటకాగిన ఉద్యోగుల జాబితాలను సిద్ధం చేశారు. దీంతో సదరు ఉద్యోగులు కంగుతింటున్నారు. పోలీసు శాఖలో సీఐ, ఎస్ఐల బదిలీలు కొంత మేర పూర్తి చేశారు. ఏఎస్ఐలు, కానిస్టేబుళ్ల బదిలీలు కూడా పెద్ద ఎత్తున జరగనున్నాయి. కొన్ని చోట్ల సీఐ, ఎస్ఐల బదిలీలు చేయాల్సి ఉంది.

అధికారుల లాబీయింగ్‌లు..

పలువురు అధికారులు, ఉద్యోగులు కోరుకున్న చోటకు బదిలీ అయ్యేలా ఎవరి ప్రయత్నాల్లో వారు నిమగ్నమయ్యారు. బదిలీలకు ఎమ్మెల్యేల లేఖ తప్పని సరి అన్న ప్రచారం జరుగుతోంది. దీంతో వారి లేఖలు పొందేందుకు అధికారులు లాబీయింగ్ చేసుకుంటున్నారు. ఇందుకోసం ప్రజాప్రతినిధుల ఇళ్లకు క్యూ కడుతున్నారు. ఇప్పటికే కొందరు ఎమ్మెల్యేలు బదిలీల సిఫార్సు లేఖలు పెద్దఎత్తున జారీ చేశారని సమాచారం. కొందరు అధికారులు అనుకూల పోస్టింగ్‌లకు సిఫార్సు లేఖల కోసం టీడీపీ నేతల ద్వారా ఎమ్మెల్యేలపై ఒత్తిడి తెస్తున్నారు. నాలుగైదు రోజుల్లో సిఫార్సుల లేఖ జారీ ప్రక్రియ పూర్తవుతుందని టీడీపీ నేతలు చెబుతున్నారు. వైసీపీ నేతలతో కలిసి పనిచేసిన అధికారులకు కూడా కొన్ని చోట్ల వారు కోరుకున్న చోట పోస్టింగ్ కోసం లేఖలు జారీ చేశారన్న విమర్శలు టీడీపీ వర్గాల నుంచి వస్తున్నాయి.

అక్రమాలపైనా నేతల దృష్టి..

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని వివిధ శాఖలకు చెందిన ఇంజనీరింగ్ విభాగాల్లోని కొందరు ఉద్యోగులు, అధికారులు ఇష్టారాజ్యంగా చెలరేగారు. వైసీపీ నేతల అవినీతికి పూర్తి స్థాయిలో సహకరించారు. ఈ ఫిర్యాదులపై ఇప్పటికే కూటమి నేతలు ఫిర్యాదులు చేశారు. కొన్ని చోట్ల అక్రమాలకు పాల్పడిన ఇంజనీర్లపై విజిలెన్స్ విచారణ జరపాలని టీడీపీ నేతలు సదరు శాఖల ఉన్నతాధికారులను ఆశ్రయిస్తున్నారు. దీంతో విజిలెన్స్ విచారణ తప్పదని ఆయా అధికారులు, ఉద్యోగులకు భయం పట్టుకుంది. కొందరు ఇంజనీర్ల అవినీతి, అక్రమాల చిట్టాను ఇప్పటికే విజిలెన్స్ అధికారులకు అందించారు. టిడ్కోలో పొరుగు జిల్లాల్లో విజిలెన్స్ విచారణ జరుగుతోంది. మున్సిపాల్టీలను కొందరు వైసీపీ నేతలు జేబు సంస్థలుగా వాడుకున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని పలు మున్సిపాల్టీల్లో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయి. రూ.కోట్లలో నిధులు స్వాహా చేశారు. పచ్చదనం మాటున నిధులు కాజేశారు. సీ బిల్లుల పేరుతో పెద్దఎత్తున నిధులను గోల్‌మాల్ చేశారు. మున్సిపాల్టీలపై కూడా విజిలెన్స్ విచారణ జరుగుతుందన్న ప్రచారంతో సదరు అధికారులు బదిలీలపై వెళ్లే పనిలో ఉన్నారు. సచివాలయ కార్యదర్శులకు కూడా స్థానచలనం ఉన్న నేపథ్యంలో ఈ పోస్టింగ్‌లపై కూడా కూటమి నేతలు ప్రత్యేకంగా దృష్టి సారించారు.



సంక్షేమం సంక్షోభం

- వసతిగృహాల్లో విద్యార్థుల అవస్థలు
- హాస్టళ్లలో సౌకర్యాల లేమి భద్రత గాలిలో దీపం
- ఐదేళ్లుగా యువత స్వయం ఉపాధి పథకాలు నిర్వీర్యం
- శాఖలో పాతుకు పోయిన అధికారులు..
- పనితీరుపై విమర్శలు
- బినామీల చేతుల్లో ఎస్సీ కార్పొరేషన్ షాపింగ్ కాంప్లెక్సులు
- వైసీపీ హయాంలో శాఖపై ఒక్కసారి కూడా జరగని సమీక్ష
- కూటమి ప్రభుత్వంలోనైనా సాంఘిక సంక్షేమ శాఖ పనితీరు గాడిలో పడేనా?
- నేడు నాగార్జున వర్సిటీలో మంత్రి డోలా సమీక్ష

గుంటూరు(విద్య), ఆగస్టు 18: ఐదేళ్లగా సంక్షేమం సంక్షోభంలో చిక్కుకుంది. వసతిగృహాల్లోని విద్యార్థుల సంక్షేమం గురించి ఆలోచించలేదు. ఎస్సీ యువత స్వయం ఉపాధిపై దృష్టి సారించలేదు. సాంఘీక సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థుల భద్రత గాలిలో దీపంలా మారినా.. ఆకలి కేకలతో అలమటిస్తున్నా.. కాస్మోటిక్స్, డైట్‌చార్జీలు చెల్లింపుల్లో జాప్యం.. ఇలా ఎన్నో సమస్యలతో సతమతం అవుతున్నా వైసీపీ పాలకులు పట్టించుకోలేదు. వైసీపీ పాలనలో ఐదేళ్ల సంక్షేమ శాఖపై సమీక్షే జరగలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. పట్టించుకోని తరగి చదివే విద్యార్థులు 15 వేల మంది వరకు ఉన్నారు. అయితే ఆయా వసతి గృహాల్లో ప్రవేశాలు, సౌకర్యాలపై ఐదేళ్లలో ఒక్కసారి కూడా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. గతంలో డీడీ, కలెక్టర్ స్థాయిలో మూడు నెలలకు ఒకసారి హాస్టళ్లపై సమీక్ష నిర్వహించేవారు. ఫలితంగా విద్యార్థుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి వచ్చేవి. అయితే గడిచిన ఐదేళ్లలో ఒక్కటంటే ఒక్క సమీక్ష కూడా నిర్వహించలేదు.

- సాంఘిక సంక్షేమశాఖ హాస్టళ్లను నాడు నేడు పథకంలో అభివృద్ధి చేస్తామని, సొంత భవనాలు నిర్మిస్తామని గత ప్రభుత్వం హామీ ఇచ్చింది. అయితే ఇందులో ఒక్కటి కూడా నెరవేరలేదు. దాదాపు 40శాతం హాస్టళ్లు అద్దె భవనాల్లోనే ఉన్నాయి.



పాలకుల హయాంలో యథా రాజా తథా ప్రజ అన్నట్లుగా అధికారులు కూడా తమకెందుకులే అన్న ధోరణిలో సంక్షేమ శాఖలో ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం సాంఘీక సంక్షేమ శాఖను తిరిగి గాడిలో పెట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి. ఈ క్రమంలో అనేక సమస్యలతో కునారిల్లుతోన్న సాంఘిక సంక్షేమశాఖపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా సోమవారం గుంటూరు సమీపంలోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి సమీక్షించనున్నారు.

- సాంఘిక సంక్షేమశాఖ హాస్టళ్ల వెల్ఫేర్ అధికారులు ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళ్తారో ఎవరికీ తెలియదు. ఫలితంగా ఇక్కడ వసతి పొందే విద్యార్థినుల భద్రత గాల్లోదీపంలా మారింది. గుంటూరు నగర నడిబొడ్డున ఉన్న సాంఘిక సంక్షేమశాఖ హాస్టల్ విద్యార్థినుల్ని యువకులు మాయమాటలు చెప్పి కిడ్నాప్ చేసిన సంఘటన ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దీనిని బట్టి వసతి గృహాల్లో విద్యార్థినుల భద్రతపై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.
- విద్యార్థినుల చేత మ్యాట్రిన్లు పనులు చేయిస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. గుంటూరుతో పాటు వివిధ ప్రాంతాల్లోని కొన్ని హాస్టళ్లలో విద్యార్థినులు ఈ సమస్యలు ఎదుర్కొంటున్నారు.

సంక్షేమంలో.. సమస్యలు

- ఉమ్మడి గుంటూరు జిల్లాలో సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 70కిపైగా ఉన్న వసతిగృహాల్లో 3 నుంచి 10వ

- సాంఘిక సంక్షేమశాఖలో పనిచేసే కొంతమంది అధికారులపై తీవ్రస్థాయిలో ఆరోపణలు ఉన్నాయి. ఉద్యోగన్నతులు, సర్వీసులు, కాంట్రాక్టు ఉద్యోగుల నియామకం వంటి విషయాల్లో ఆరోపణలు ఉన్నాయి. దీనికి తోడు వార్డెన్లు, మ్యాట్రిన్ల నుంచి అధికారులు మామూళ్లు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి.
- ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో అనేక ప్రాంతాల్లో షాపింగ్ కాంప్లెక్స్‌లు ఉన్నాయి. ఈ కాంప్లెక్సుల్లోని దుకాణాలు బినామీ పేర్లతో సబ్ లీజుల్లో నడుస్తున్నాయి. వేలాది రూపాయలు అద్దెవసూలు చేస్తూ పైసా కూడా శాఖకు చెల్లించని ప్రబుద్ధులు ఉన్నారు.
- ఎస్సీ కార్పొరేషన్ ద్వారా యువతకు అందే స్వయం ఉపాధి పథకాలు ఐదేళ్లుగా నిర్వీర్యమయ్యాయి. భూమి కొనుగోలు పథకం, మహిళా స్వయం ఉపాధి వంటి రాష్ట్రస్థాయి పథకాలతో పాటు కేంద్రం అమలు చేసే సఫాయికర్మచారి పథకాల్ని గత వైసీపీ ప్రభుత్వం అటకెక్కించింది.
- వసతిగృహాల్లోని విద్యార్థులకు డైట్, కాస్మోటిక్స్ చార్జీలు కోట్లలో పెడింగ్‌లో ఉన్నాయి.

197 మందికి ఒకే ఉపాధ్యాయుడు

గురుకులంలో బాలికల విద్యకు గ్రహణం ● గిరిజన బాలికల పాఠశాలపై ప్రభుత్వం శీతకన్ను ● పెదతురకపాలెం పాఠశాలలో అటకెక్కిన చదువులు ● టీసీలు తీసుకు వెళుతున్న పదో తరగతి విద్యార్థినులు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 18: ఇటీవలే ఆదివాసీ దినోత్సవాన్ని ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. అయితే ఆ స్థాయిలో వారి సమస్యలపై అధికారులు కానీ, పాలకులు కానీ దృష్టి సారించడంలేదని ఆ వర్గాల నుంచి విమర్శలు వస్తున్నాయి. నరసరావు పేట మండ లం పెదతురకపాలెం గ్రామం వద్ద ఉన్న గిరిజన గురుకుల బాలికల పాఠశాల దుస్థితే ఇందుకు నిదర్శనంగా కనిపిస్తోంది. 2016లో టీడీపీ హయాంలో ఏర్పాటు చేసిన గిరిజన గురుకుల బాలికల పాఠశాల గురించి వైసీపీ ప్రభుత్వం నాలుగేళ్లుగా పట్టించుకోలేదు. గురుకుల గిరిజన బాలికల విద్యకు గ్రహణం పట్టినా నాటి ప్రభుత్వం పట్టిం చుకోలేదు. 197 మంది విద్యార్థినులున్న



వరండాలో చదువుకుంటున్న విద్యార్థినులు

పాఠశాలపై నాటి ప్రభుత్వం శీత కన్ను వేయగా, కూటమి ప్రభుత్వ హయాంలోనూ అదే పరిస్థితి నెలకొందని తల్లిదండ్రులు వాపోతున్నారు.

ప్రారంభించి.. పట్టించుకోలేదు..

పల్నాడు జిల్లా పరిధిలోని ఆదివాసీ గిరిజన బాలికల కోసం కేంద్ర ప్రభుత్వ నిధులతో టీడీపీ హయాంలో పాఠశాలను ఏర్పాటు చేశారు. అయితే వైసీపీ ప్రభుత్వం కేంద్రం విడుదల చేసిన నిధులను రాష్ట్ర ఖజానాకు మళ్లించుకుని పాఠశాల నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేయలేదు. ఎన్నికలకు ముందు పాఠశాలను ప్రారంభించి చేతులు దులుపుకుంది. ఇక్కడ ఆరు నుంచి 10 వరకు తరగతులకు 197 మంది బాలికలు చదువుతున్నారు. ఆరంభంలోనే అడ్మిషన్లు బాగా ఉన్నా, పాఠశాలలో అన్ని వసతులు ఉన్నా చదువు చెప్పేందుకు ఉపాధ్యాయులు లేకపోవడం విశేషం. ఉపాధ్యాయ నియామకాలను ప్రభు త్వం విస్మరించింది. దీంతో తరగతులు జరగక బాలికలు విద్యకు దూరమవుతున్నారు. ఉపాధ్యాయులు లేకపోవ డంతో పదోతరగతి విద్యార్థినులు టీసీలు తీసుకు వెళ్తున్నారు.

ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుడు ఒకరే..

గిరిజన గురుకుల బాలికల పాఠశాలకు ప్రిన్సిపల్, ఉపా.ధ్యాయుడు ఒకరే. ఆయనే అన్ని తరగతులు నిర్వహించా ల్సిన దుస్థితి నెలకొంది. కాంట్రాక్ట్ విధానంలో మరొకర్ని నియమించినా సదరు ఉపాధ్యాయుడు విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని తల్లిదండ్రులు తెలిపారు. బాలి కల పాఠశాలకు గతంలో ఉన్న మహిళా ప్రిన్సిపాల్‌ను బదిలీ చేసి పురుషుడ్ని ఇక్కడ నియమించారు. ఉపాధ్యా యుల కొరతపై గిరిజన సంక్షేమ శాఖ అధికారులను వివ రణ కోరగా ఇది గిరిజన శాఖ కార్యదర్శి పరిధిలో అం శమని తామేమీ చెప్పలేమన్నారు.

ఇసుక ఉచితతో రూ.7.50 కోట్లు ఆదా



- టన్నుకు కేవలం రూ.250 లోడింగ్ చార్జీ
- వైసీపీ ప్రభుత్వంలో టన్నుకు రూ.375 వసూలు
- వీటికి రవాణా, లోడింగ్, ఇతర ఖర్చులు అదనం

గుంటూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుక వల్ల రెండు నెలల వ్యవధిలో జిల్లాలో ప్రజలకు రూ.కోట్లలో మేలు జరిగింది. ఐదు స్టాక్ యార్డుల నుంచి ఇప్పటి వరకు ప్రజలు ఉచితంగా తీసుకెళ్లిన ఇసుకని వైసీపీ ప్రభుత్వంలో అమలు చేసిన టన్ను ధర రూ.375తో లెక్కిస్తే దాదాపుగా రూ.7.50 కోట్లు ఆదా అయ్యింది. ప్రస్తుతం కృష్ణానదికి వరద పోటెత్తుతోన్నా జిల్లా వ్యాప్తంగా ఎక్కడా ఇసుక కొరత సమస్య తలెత్త లేదు. ఇందుకు కారణం వరద ప్రవాహానికి దూరంగా ఇసుక స్టాక్‌యార్డులు ఉండటమే. అదే ఈ స్టాక్‌యార్డులు లేకుండా ఉండి ఉంటే ఇసుక తవ్వకాలు నిలిచిపోయాయని, ధరని పెంచేసి దళారులు సొమ్ము చేసుకుని ఉండేవారు. ఇసుక పుష్కలంగా లభిస్తుండటంతో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నెంబరుకు ఎలాంటి ఫిర్యాదులు రావడం లేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇసుక కోసం సామాన్య ప్రజలు తంటాలు పడని రోజంటూ లేదు. అధికారంలోకి వస్తూనే ఇసుక విధానాన్ని రద్దు చేసి భవన నిర్మాణ కార్మికులను రోడ్డున పడేసేలా జగన్ ప్రభుత్వం చేసింది. ఆ తర్వాత తెచ్చిన విధానాలు ఏవీ కూడా వారికి అక్కరకు రాలేదు. చివరికి స్టాక్ యార్డు వద్ద టన్ను రూ.375కి కొనుగోలు చేయాల్సిన పరిస్థితికి తీసుకొచ్చింది. లోడింగ్, రవాణా, ఇతర ఖర్చులు కలిపితే లారీ ఇసుకకి రూ.15 వేల వరకు చెల్లించాల్సిన దుస్థితి ఉండేది. అయితే నేడు కేవలం లోడింగ్ చార్జీలు టన్నుకు రూ.250 మాత్రమే చెల్లించి ఇసుకని తీసుకునే పరిసితిని టీడీపీ కూటమి ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చింది. జిల్లాలో ఇప్పటివరకు 1,97,764 మెట్రిక్ టన్నుల ఇసుకని ప్రజలు రీచ్‌ల నుంచి తీసుకువెళ్లారు. దీని వల్ల రూ.7.50 కోట్ల వరకు ప్రజలకు మిగిలాయి.

స్టాక్ యార్డుల్లో వేల టన్నులు

ఇంకా పలు స్టాక్‌యార్డుల్లో వేల టన్నుల్లో ఇసుక నిల్వలు ఉన్నాయి. కొల్లిపరలో 22 వేలు, మున్నంగిలో 1,66,178, గుండిమెడలో 5,587, తాళ్ళాయపాలెంలో 3,85,544, లింగాయపాలెం 2,68,187 టన్నుల ఇసుక నిల్వలు ఉన్నాయి. వీటికి అదనంగా మరికొన్ని ఇసుక రీచ్‌లను కూడా జిల్లా యంత్రాంగం గుర్తించి వాటిల్లో తవ్వకాల కోసం పర్యావరణ అనుమతులను కోరింది. దీని వలన జిల్లాలో ఇసుక కొరత అనేది తలెత్తే అవకాశం లేదు. ప్రస్తుతం వరద వస్తోన్నందున రాబోయే రోజుల్లో ఇసుక మేటలు కూడా సమృద్ధిగా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉన్నది.

ఫైళ్లదహనం.. వైసీపీ అక్రమాలకు నిదర్శనం

● వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



ఎమ్మెల్యే జీవీ

వినుకొండటౌన్, ఆగస్టు 18: మదనపల్లి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో కీలక దస్త్రాల కాల్చివేత నుంచీ, ధవళేశ్వరంలో పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన పత్రాల దహనం వంటి ఘటనలు వైసీపీ ఐదేళ్ల పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలకు నిదర్శనమని వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత పాలకుల పాపాలకు సాక్ష్యాధారాలు లేకుండా చెయ్యాలనే ఇలా బరితెగింసున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ కార్యాలయాల్లో దస్త్రాలు తగలబెట్టేస్తుండడంపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, సంబంధిత శాఖల మంత్రులను ఆయన ఈ సందర్భంగా కోరారు. పోలవరం ప్రాజెక్టు దస్త్రాల్లో భూవ్యవహారాల్లో వారి దారుణాలు వెలుగు చూడకూడదనే వైసీపీ పెద్దలు, వారికి కొమ్ముకాస్తున్న కొందరు అధికారులు ఈ చర్యలకు పాల్పడినట్లు తెలుస్తోందన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసిత ప్రాంతాలకు సంబంధించి భూ వ్యవహారాల్లో వైసీపీ నేతలు బందిపోట్లుగా దోచేశారని, నకిలీ రైతుల పేరిట కోట్లు దండుకున్నారని వాటన్నిటినీ ఎట్టి పరిస్థితుల్లో తప్పక బయట పెడతామన్నారు. ఫైళ్ల ధ్వంసంలో ప్రమేయం ఉన్న అధికారులపైన చర్యలు తీసుకోవాలని ఇప్పటివరకు జరిగిన ఫైళ్ల దహనం కుసులన్నింటినీ ఫాస్ట్‌ట్రాక్ కోర్టుకు ఇవ్వాలని ఎమ్మెల్యే జీవీ ప్రభుత్వాన్ని కోరారు.

అన్న క్యాంటీన్‌లపై విమర్శలు హాస్యాస్పదం

● జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా దంపతులు

గుంటూరు సిటీ, ఆగస్టు 18: రాష్ట్రంలో అన్నక్యాంటీన్లను పునః ప్రారంభించి పేదలకు పట్టెడన్నం పెడుతుంటే దానిని చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు చేస్తున్న విమర్శలు హాస్యాస్పదంగా ఉన్నాయని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిసీనా, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ కత్తెర సురేష్ కుమార్‌లు ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో విమర్శించారు. కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి నిరుపేదలకు, అనాథలకు ఆసరాలేనివారికి అన్నం పెడుతుంటే వైసీపీ నేతలు అవాకులు, చవాకులు పేలటం ఏంటని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వ హాయంలో అన్నక్యాంటీన్లను నిర్దాక్షిణ్యంగా మూసివేసి జగన్‌మోహన్‌రెడ్డి తన రాక్షస తత్వాన్ని చాటుకున్నారని విమర్శించారు. అదే అన్నక్యాంటీన్‌లను నేడు కూటమి ప్రభుత్వం తిరిగి ప్రారంభిస్తే ప్రజల నుంచి లభిస్తున్న అభిమానాన్ని చూసి ఓర్వలేక వైసీపీ నేతలు అసూయ పడుతున్నారన్నారు. చేతనైతే అయితే పేదవారికి అన్నం పెట్టాలేగానీ, వారి నోటికాడి ముద్ద లాగేసే విధానాలను అవలంభించడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా అన్నక్యాంటీన్లపై విమర్శలు మానుకోవాలని హితవు పలికారు. గాని పెట్టే వారిని విమర్శించడం తగదని హితవు పలికారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగిస్తోందన్నారు. ఇచ్చిన అన్ని పథకాలు అమలవుతాయని వాటి గురించి ప్రజలు ఆందోళన చెందవద్దన్నారు. కూటమి ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్న వైసీపీ నేతల మాటలను నమ్మవద్దని సూచించారు.

వసతిగృహ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు(విద్య),ఆగస్టు 18:మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రీ, పోస్టుమెట్రిక్ బాలికల వసతి గృహాల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖాధికారి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రీమెట్రిక్ మైనార్టీ వసతిగృహం గుంటూరు రవీంద్రనగర్ 1వలైనులో, పోస్టుమెట్రిక్ బాలకల వసతిగృహం పొన్నూరు రోడ్డులోని ఆనందపేటలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హాస్టల్స్‌లో వసతి పొందాలనుకునేవారు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌ను సంప్రదించాలని (9392105096, 8804422522) కోరారు.

విద్యార్థినులు ఒత్తిళ్లకు తలొగ్గొద్దు



విద్యార్థినికి ఉపకార వేతనాల చెక్కు అందజేస్తున్న మంత్రి పెమ్మసాని

● కోల్‌కతా ఘటనలు పునరావృత్తం కాకూడదు
● మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి
● కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థినిలు ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గొద్దని, కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై జరిగిన ఘటన మరోసారి పునరావృతం కాకూడదని గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరులోని కమ్మ జన సేవా సమితి ఆధ్వర్యంలో చేతన్ ఫౌండేషన్, రోటరీ క్లబ్ సంయుక్త నేతృత్వంలో ఆదివారం జరిగిన విద్యార్థినులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ, దివ్యాంగులకు కృత్రిమ అవయవాల అందజేత కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పెమ్మసాని మాట్లాడుతూ విద్యార్థినులు ఎవరో చెప్పారనో, ఒత్తిడి చేశారనో తమ నిర్ణయాలను మార్చుకో వాల్సిన అవసరంలేదని, ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని, భవిష్యత్తుకు సంబంధించిన నిర్ణయాలు తీసుకునే సమయంలో తొందరపడొద్దని, మహిళలు ఎదుటి వ్యక్తులకు స్ఫూర్తిగా ఉండాలని సూచించారు. కోల్‌కతాలో జరిగిన ఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసు కోవాలన్నారు. అనంతరం 180 మంది విద్యార్థినులకు ఒక్కొక్కరికి రూ.10 వేలు, రూ.15 వేలు చొప్పున స్కాలర్‌షిప్పులు అందజేశారు. అలాగే దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను, పలువురికి కుట్టుమిషన్లు, గ్రైండర్లు, తోపుడు బండ్లను పెమ్మసాని పంపిణీ చేశారు. కార్యక్రమంలో చేతన గ్లోబల్ ఫౌండేషన్ ఛైర్మన్ వెనిగళ్ళ రవికుమార్, బెటర్ వాషింగ్టన్, లామ్ శ్రీకృష్ణ, మజ్జిగ కేశవ కిషోర్ కుమార్, కమ్మ జనసేవా సమితి సెక్రటరీ చుక్కపల్లి రమేష్, రోటరీ క్లబ్ గుంటూరుసెంటెనియల్ ప్రెసిడెంట్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఆత్మసంతృప్తి కోసం సేవ చేస్తున్న లయన్స్ క్లబ్

ఆత్మ సంతృప్తి కోసం సేవ చేసేందుకు ఏర్పడిన సంస్థ లయన్స్ క్లబ్ అని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరం ప్రాంగణంలో ఆదివారం జరిగిన లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ మెగా సేవ మహోత్సవం కార్యక్రమంలో ఆయన విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో మహిళలకి 100 కుట్టుమిషన్లు, 50 గ్రైండర్లతో పాటు ఇతర పనిముట్లను ఆయన అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ చిగురుపాటి వరప్రసాద్, ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, టీడీపీ సీనియర్ నేత ఉగ్గిరాల సీతారామయ్య, కార్పొరేటర్ పోతురాజు సమతతో పాటు లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ పి.గోపీచంద్, పీఐడీ ట్రస్టీ వి.విజయకుమార్ రాజు, క్లబ్ అంతర్జాతీయ మాజీ డైరెక్టర్ కె వంశీధర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

అదనం పేరుతో నిధులు స్వాహా

● సెక్యూరిటీ గార్డులకు బస్‌చార్జీలు పేరుతో రూ. వేలు
● క్యాజువల్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకూ అంతే..
● ఏఎన్‌యూలో దుర్వినియోగంపై విమర్శలు
● విచారణతోనే వాస్తవాలు వెలుగులోకి..

గుంటూరు(విద్య), ఆగస్టు 18: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో అదనపు పారితోషకాల పేరుతో నిధులు దుర్వినియోగం అవుతున్నాయనే విషయంపై ఆరోపణలు వస్తున్నాయి. ఉతాధికారులు కొందరు సిబ్బందికి అదనపు వారితోషకం పేరుతో నిధులను దోచి పెడుతున్నారు. నియామకం చేసుకున్న సిబ్బంది చేత పని వేళలో నిబంధనల ప్రకారం పనిచేయించుకుని వేతనాలు మాత్రమే ఇవ్వాలి. కానీ మాజీ ఉన్నతాధికారులు కొందరు సెక్యూరిటీ గార్డులు, కాజువల్ వర్కర్లపై అమితమైన ప్రేమ చూపి, వారికి వేతనాలతో పాటు బస్సు చార్జీలు, అదనపు వారితోషకం వంటి పేర్లతో ప్రతినెల వేలాది రూపాయలు ముట్టచెప్పారు. దీంతో ఆయా సిబ్బంది ప్రతి నెల వేతనంతో పాటు అదనపు నగదు పొందతూ జేబులు నింపుకుంటున్నారు. రాష్ట్రంలో కొత్తగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైసీపీ ప్రభుత్వంలో నియమితులైన ఉన్నతాధికారులు రాజీనామా చేయడంతో వారి స్థానంలో నూతన ఉన్నతాధికారులు నియమితులైనారు. వారుకూడా ఈ విషయపై దృష్టిసారించకపోవడంతో వర్సిటీ నిధులు కరిగిపోతున్నాయి.

విజయవాడలో ఉంటున్న మాజీ ఉపకులపతి క్యాంపు కార్యాలయం వద్ద పనిచేసిన సెక్యూరిటీ గార్డులకు బస్ చార్జీలు లోకల్ కన్వీనియన్స్ చార్జీలు కింద ఈఏడాది జూన్ (వేతనాలు కాకుండ) రూ.11,254 చెల్లించారు. అలాగే 5 అవుట్‌సోర్సింగ్, కాజువల్ వర్కర్లకు ఈ ఏడాది జూన్‌కు అదనపు పారితోషకం పేరుతో రూ.42,176 చెల్లించారు. మరో జీపు డ్రైవరుకు అదనపు పారితోషకం పేరుతో ఈ ఏడాది జూన్ రూ.29,800 చెల్లించారు. విశ్వవిద్యాలయం ఇంజనీరు కార్యాలయంలో రోజువారి ఉద్యోగులుగా పనిచేసిన ముగ్గురికి ఈ ఏడాది మేలో రూ.38,700 అదనపు పారి తోషకం చెల్లించారు. ఇలా దోపిడీ కొన్నేళ్లక్రితం ప్రారంభమై నేటికీ యథేచ్ఛగా కొనసాగుతోంది. ప్రస్తుత ఉన్నతాధికారులు కూడా ఈ అదనపు బిల్లులు మంజూరు చేయటంపై తీవ్ర విమర్శలు వ్యక్తమ వుతున్నాయి. ఇప్పటికైనా విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు ఈదోపిడీపై విచారణకు ఆదేశిస్తే వాస్తవాలు వెలుగుచూసే అవకాశం ఉంది.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

దుర్గి, ఆగస్టు 18: మండల కేంద్రమైన దుర్గిలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ధర్మవరంకు చెందిన షేక్ లాలు (50) దుర్గి నుంచి ధర్మవరంకు శనివారం రాత్రి నడిచి వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన మన్నీడి కృష్ణ ఆటోలో ధర్మవరం వెళ్తూ ఢీ కొట్టాడు. ఈ సంఘటనలో లాలు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుమారుడు సైదావలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అలాగే ప్రకాశంజిల్లా యర్రగొండపాలెం మండలం వెంకటాద్రి గ్రామానికి చెందిన కంచెపోగు వెంకటేశ్వర్లు(36) కూలీపనుల కోసంవచ్చి దుర్గి శివారు ప్రాంతంలో నివాసముంటున్నాడు. ఆది వారం వివిధ పనుల నిమిత్తం దుర్గి సెంటర్‌కు వచ్చి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా వాహనం అదుపు తప్పటంతో కింద పడిపోయాడు. తీవ్ర గాయాలతో పడి ఉన్న అతడిని కారంపూడి నుంచి వస్తున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, ఎస్ఐ సుధీర్‌కుమార్‌లు గమనించారు. క్షతగాత్రుడు వెంకటేశ్వర్లుని ఎస్ఐ తన వాహనంలో మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు.

న్యాయాధికారుల సంఘం

రాష్ట్ర అధ్యక్షుడిగా చక్రపాణి



జీ.చక్రపాణి



టీ. లీలావతి

గుంటూరు(లీగల్),ఆగస్టు 18: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయాధికా రుల సంఘం అధ్యక్షుడిగా జీ. చక్రపాణి ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడలోని భూ సమీకరణల ప్రత్యేక న్యాయస్థానంలో రాష్ట్ర న్యాయాధికారుల సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో నూతన కార్యవర్గానికి ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో 521 మంది న్యాయాధికారులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.న్యాయాధికారుల సంఘం రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా ప్రస్తుతం గుంటూరు ఫ్యామిలీ కోర్టులో అదనపు జిల్లా జడ్జిగా పనిచేస్తున్న జీ.చక్రపాణి ఎన్నికయ్యారు. గుంటూరుజిల్లా న్యాయ సేవాధికారసంస్థ కార్యదర్శిగా పనిచేస్తున్న టీ.లీలావతి, హిందూ పూర్ 2వ అదనపు జిల్లా జడ్జి కే.శైలజ, సోంపేట సీనియర్ సివిల్‌జడ్జి జే.శ్రీనివాసరావులు ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు, కాకినాడ సీనియర్ సివిల్ జడ్జి నంబళ్ల రమేష్‌నాయుడు జనరల్ సెక్రటరీ, ట్రెజరర్‌గా ఎన్నికయ్యారు. విశాఖపట్నం సీనియర్ సివిల్‌జడ్జి ఎం.ప్రదీప్ కుమార్, 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి జీ.కార్తీక్, రాజమండ్రి అడిషనల్ జూనియర్ సివిల్‌జడ్జి ఏ.కృష్ణప్రసాద్‌లు జాయింట్ సెక్రటరీలుగా ఎన్నిక య్యారు. కర్నూలు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బీ.లీలా వెంకటశేషాద్రి, చిత్తూరు అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌పీడీ వెన్నెల, నంద్యాల అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి బీ.రాధారాణి, విజయవాడ 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి డాక్టర్ సీహెచ్. శ్రీనివాసబాబులు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. విశ్రాంత జిల్లా జడ్జి, ప్రస్తుత హైకోర్టు న్యాయవాది విరూపాక్ష దత్తాత్రేయ గౌడ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం

22 లోగా దరఖాస్తు చేసుకోవాలి

గుంటూరు(విద్య), ఆగస్టు 18: ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం ఈనెల 22లోగా దరఖాస్తుచేసుకోవాలని గుంటూరుజిల్లా విద్యాశాఖ అధికారి పీ. శైలజ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధ్యాయులు,హెచ్‌ఎంలు వారి దరఖాస్తులను 22వ తేది నాటికి ఎంఈవోలకు అందజేయాలని, ఎంఈవోలు వాటిని పరిశీలించి 24న జిల్లా ఉప విద్యాశాఖాధికారికి అందజేస్తారని, వారు వాటిని 27వ తేదీన జిల్లా విద్యాశాఖకు అందజేయాలని సూచించారు. దరఖాస్తుదారులు కనీసం 15 ఏళ్ల సర్వీస్ ఉండాలని, ఎటువంటి క్రమశిక్షణా చర్యలకులోనై ఉండరాదని స్పష్టం చేశారు.

గంజాయి తరలిస్తున్న యువకుల అరెస్టు

బాపట్ల,ఆగస్టు18: బాపట్ల పట్టణంలోని ఉప్పరపాలెంలో ఆదివారం గంజాయితో వెళుతున్న ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకొని వారివద్ద 400గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ ఆర్.అహ్మద్‌జానీ తెలిపారు. బాపట్ల రైల్వే స్టేషన్‌లో రైలు దిగిన ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై గంజాయితో వెళుతున్నట్లు తమకు సమాచారం రాగా తహసీల్దార్ శ్రీదేవి, పోలీసు సిబ్బందితో ఆ యువకులను అదుపు లోకి తీసుకున్నామన్నారు. వారివద్ద చిన్న పొట్లాల్లోవున్న గంజాయి ని స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుల్లో ఒకరు బాపట్ల పట్టణం క్రిస్టియన్‌పేటకు చెందిన బెజ్జం సువర్ణరాజు, మరొకరు న్యూజెండ్ల మండలం జంగాలపల్లి గ్రామానికి చెందిన వల్లెపు చాణిక్యాగా గుర్తించామన్నారు. వీరిద్దరూ వైజాగ్‌లో చదువుకుంటూ గంజాయి రవానాకు పాల్పడుతున్నారన్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.



రెండు క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు


రెండు క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల

మాచర్ల రూరల్, ఆగస్టు 18: నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ అధికారులు ఆదివారం ప్రాజెక్ట్ రెండు క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేశారు. రెండు గేట్లను 8 అడుగుల మేర ఎత్తి 24,920 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో పూర్తి స్థాయి నీటిమట్టం 590.00 అడుగులు ఉంది. ఇది 312.04 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8067 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 6791 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,273 క్యూసెక్కులు, రెండు క్రస్ట్ గేట్ల ద్వారా 24,920, ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సీ ద్వారా 600 క్యూసెక్కులు, మొత్తం అవుట్‌ఫ్లో 71,451 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 71,451 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతలకు 55 వేల క్యూసెక్కులు..

● టెయిల్‌పాండ్ ప్రాజెక్టులో 1.02 ఎంయుల విద్యుదుత్పత్తి

రెంటచింతల,ఆగస్టు 18: సత్రశాల వద్ద కృష్ణానదిపై నిర్మించిన నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు చెందిన 5 క్రస్ట్ గేట్లను 2 మీటర్ల ఎత్తి 46,236 క్యూసెక్కులు,విద్యుదుత్పత్తి అనంతరం టేల్ రేస్ ఛానల్ ద్వారా 8764 మొత్తం 55 వేల క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ కే.వెంకటరమణ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం అర్ధరాత్రి 12 గంటల వరకు రెండు యూనిట్ల ద్వారా 1.02 ఎంయూల విద్యుత్ తయారైందన్నారు. రిజర్వాయర్‌లో 75.40 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 7 టీఎంసీలకు సమానమన్నారు. ఎగువన వున్న సాగర్ నుంచి 54 వేల క్యూసెక్కులు రిజర్వాయర్‌కు వస్తుందన్నారు.



ప్రకాశం బ్యారేజి నుండి దిగువకు విడుదల అవుతున్న వరదనీరు

ప్రకాశం బ్యారేజీ నుంచి నీరు విడుదల

తాడేపల్లి టౌన్, ఆగస్టు 18: ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి నుండి దిగువకు నీటిని విడుదల కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు నుండి 52 వేలు, కీసర వాగు నుండి 2వేల క్యూసెక్కుల వంతున మొత్తం 54 వేల క్యూసెక్కుల వరద నీరు ఆదివారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్లు నీటిపారుదల శాఖ జేఈ దినేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 50 గేట్లను 1 అడుగు వంతున ఎత్తి దిగువకు 36 వేల 500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అలాగే తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 17వేల 400 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు జేఈ తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



రైతు వెంకటేశ్వర్లు మృతదేహం

బొల్లాపల్లి, ఆగస్టు 18: రేమిడిచర్ల గ్రామానికి చెందిన మోటపోతుల వెంకటేశ్వర్లు(64) అనే రైతు అప్పుల బాధ తాళలేక శనివారం రాత్రి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ బాలక్రిష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటేశ్వర్లు గత నాలుగైదు సంవత్సరాల్లో తనకు ఉన్న సొంత పొలం నాలుగు ఎకరాలతో పాటు మరో ఆరు ఎకరాలు కౌలుకు తీసుకొని సాగు చేశాడు. పెట్టుబడి కోసం అప్పులు చేశాడు. పంట దిగుబడి, మార్కెట్‌లో రేటు విషయంలో ప్రతి ఏటా నష్టాలనే చవిచూశాడు. ఈక్రమంలో రూ.15 లక్షల వరకు అప్పులయ్యాయి. దీంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. శనివారం రాత్రి డాబాపైకి పడుకొన్నాడు. ఉదయం ఎంతసేప టికీ కిందికి రాకపోవడంతో కుటుంబ సభ్యులకు పైకి వెళ్ళగా అతని పక్కనే పురుగు మందు పెట్టుకొని ఉండటం చూసి వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికి మృతి చెందాడని డాక్టర్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనస్థలానికి వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం వినుకొండ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఎస్ఐ ఏ.బాలకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. వెంకటేశ్వర్లుకు భార్య సుందరమ్మ, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

వైద్యుల రక్షణకు కఠిన చట్టాలు చేయాలి

● ఆస్పత్రులను సురక్షిత ప్రాంతాలుగా ప్రకటించాలి
● కేంద్ర మంత్రి జేపీ నడ్డాకు ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు లేఖ



ఎంపీ లావు

గుంటూరు (మెడికల్) ఆగస్టు 18: కేంద్ర ప్రభుత్వం కఠినచట్టాలు రూపొందించి వైద్యులు, ఆస్పత్రుల రక్షణపై నమ్మకం కలిగించాలని ఎంపీ, లోక్‌సభ టీడీపీ ఫ్లోర్‌లీడర్ లావు శ్రీకృష్ణదేవరాయలు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు కేంద్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ మంత్రి జేపీ నడ్డాకు ఆయన లేఖ రాశారు. కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ వైద్య కళాశాల ఆస్పత్రిలో ట్రైనీ పీజీ విద్యార్థిని అత్యాచారం, హత్య ఘటన హృదయాన్ని కలచి వేసిందని ఎంపీ పేర్కొన్నారు. కొంతకాలం గా దేశవ్యాప్తంగా వైద్యులపై, ఆస్పత్రులపై దాడులు పెరుగుతున్నాయని, వైద్యుల రక్షణకు కేంద్ర ప్రభుత్వం కఠినచట్టాలు అమలుచేయాల్సిన ఆవశ్యక తను కోల్‌కతా దారుణ ఘటన మరోసారి గుర్తు చేసిందన్నారు. ఆస్పత్రులను సురక్షిత ప్రాంతాలుగా ప్రకటించాలని కోరారు. వైద్యులపై, ఆసుపత్రులపై దాడులు దిగే వారిపై నాన్ బెయిల్‌బుల్ సెక్షన్‌లు అమలు చేయడంతో పాటు భారీగా జరిమానా విధించాలని సూచించారు. రోగులకు వైద్యపరమైన ఇబ్బందులు ఎదురైతే తెలుసుకొనేందుకు ప్రతి ఆస్పత్రిలో ఫిర్యాదుల విభాగం ఏర్పాటు చేయాలన్నారు. చికిత్స విషయంలో వైద్య సంబంధమైన ఘర్షణలు చెలరేగినప్పుడు రోగుల తరఫున ప్రభుత్వపరంగా లభించే చట్టపరమైన సాయం వివరాలను ప్రజలందరికి తెలిసేలా తగిన ప్రచారంచేయాలని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డాకు ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు విజ్ఞప్తి చేశారు.



శిక్షణ తరగతుల్లో పరికరాల తయారీ, వినియోగం గురించి వివరిస్తున్న నిపుణులు

విపత్తుల సమయంలో

హామ్ రేడియోదే కీలక భూమిక

● అమెచ్యూర్ రేడియో ఔత్సాహికుల సాధికారత సదస్సులో వక్తలు

గుంటూరు, ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ప్రజలకు అవసరమైన సమాచారాన్ని చేరవేయడంలో హామ్ రేడియోదే కీలకపాత్ర అని పలువురు వక్తలు స్పష్టం చేశారు. ఇటీవల కేరళ రాష్ట్రంలోని వయనాడ్‌లో జరిగిన విపత్తు సమయంలో హామ్ రేడియో అందించిన సేవలు అమూల్యమైనవని చెప్పారు. ఆదివారం గుంటూరు జిల్లా పెదకాకానిలోని అమెచ్యూర్ రేడియో కమ్యూనిటీలో కొత్తగా ఈ రంగంలోకి కోర్సులు పూర్తిచేసుకొని వచ్చిన ఔత్సాహికులకు ఒక్కరోజు శిక్షణ తరగతులను నిర్వహించారు. హామ్ రేడియోలో బేసిక్స్ పరికరాల తయారీ, వాటిని ఏర్పాటు చేయడం, వినియోగించడం, యాంటెనా థియరీ, నిర్మాణం, గజిట్‌లో ముసాయిదా సవరణల గురించి వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి విజయవాడ నుంచి వైర్‌లెస్ మానిటరింగ్ స్టేషన్ అధికారులు అభిషేక్ కుమార్ (ముఖ్య అతిథి), బంగార్రాజు, పద్మజ అతిథులుగా హాజరై అత్యవసర సమాచార, కమ్యూనిటీ నిర్మాణంలో హామ్ రేడియోల ప్రాముఖ్యత గురించి వివరించారు. వీరితో పాటు అసిస్టెంట్ కమిషనర్ పీ దిగ్విజయం, విశ్రాంత డీఈవో టీ ఆర్ జయచందర్ కూడా తమ అనుభవాలను వివరించారు. అనిల్, వినయ్ ప్రాక్టికల్ ట్రైనింగ్ సెషన్స్‌ని నిర్వహించారు. వీహెచ్‌ఎఫ్, హెచ్‌ఎఫ్ యాంటెనాలు గురించి విశ్లేషించారు. అమేయ అమెచ్యూర్ రేడియో అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిక్షణ తరగతుల్లో అధ్యక్షుడు ఏ వీ సత్యన్నారాయణ, సెక్రెటరీ బోయపాటి వెంకటరమణ, కోశాధికారి ఎన్ లక్ష్మీకాంత్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి వై.వెంకటేశ్వరరావు, సలహాదారు, జీసీ మెంబర్ రాయప్రోలు శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అన్న అంత్యక్రియలకు వచ్చి తమ్ముడు మృతి

● ప్రమాదవశాత్తు కాల్వలోకి జారిపడి గుర్రపుడెక్కలో చిక్కుకొని..

చేబ్రోలు, ఆగస్టు18: అన్న అంత్య క్రియలకు వచ్చి ప్రమాదవశాత్తు కాలు జారి కాల్వలో పడి తమ్ముడు మృతి చెందిన సంఘటన ఆదివారం చేబ్రోలులో చోటు చేసుకుంది. చేబ్రోలు ఎస్ఐ వెంకట కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని వడ్లమూడి గ్రామానికి చెందిన రామయ్య మృతి చెందగా ఆదివారం అతడి అంత్య క్రియలు జరిగాయి. ఈ కార్యక్రమానిక రామయ్య సోదరుడు పెదనందిపాడు మండలం నాగులపాడుకు చెందిన పాలపర్తి కృష్ణ (54) విచ్చేసాడు. రామయ్య అంత్యక్రియలు పూర్తి అయిన తర్వాత బంధువులు అందరూ కలిసి సమీపంలోని అప్పాపురం కాల్వలోకి స్నానాల కోసం దిగారు. కాల్వ గట్టుపై ఉన్న కృష్ణ కాలు జారీ కాల్వలో పడి గల్లంతైయాడు. బంధువులు గాలించగా సమీపంలోనే కాల్వలోవున్న తూటి కాడ గుర్రపు డెక్కలో చిక్కుకొని కృష్ణ మృతి చెంది ఉన్నాడు. మృతుడి కుమారుడు నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కృష్ణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



లాంచీల ద్వారా కొండకు చేరుకుంటున్న పర్యాటకులు

నాగార్జునకొండలో పర్యాటకుల సందడి

మాచర్ల రూరల్, ఆగస్టు 16: ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జున కొండను ఆదివారం పర్యాటకులు భారీగా సందర్శించారు. లాంచీ స్టేషన్ నుంచి నాగార్జున కొండకు వివిధ లాంచీలలో చేరుకున్నారు. కొండపై మ్యూజియంలోని బుద్ధుని ప్రతిమలు, రాతిపనిముట్లు, మట్టికుండలు, బుద్ధుని పాలరాతి విగ్రహం, మహాస్థూపం, స్నానాలఘాట్, బోధివృక్షం వంటి వాటిని తిలకించారు. అనంతరం అనుపులో యాంఫీ స్టేడియం, అశ్వ మేధ యజ్ఞశాల, శ్రీరంగనాథస్వామి దేవాలయం, ఎత్తిపోతల జలపాతాన్ని వీక్షించారు. పర్యాటకులు భారీగా సందర్శించడంతో లాంచీ స్టేషన్‌కి రూ. 93 వేల ఆదాయం సమకూరినట్లు లాంచీ యూనిట్ అధికారులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

పిడుగురాళ్ల,ఆగస్టు18: పిడుగురాళ్ల మండలం తుమ్మలచెరువు గ్రామంలో మహిళ అనుమానస్పద స్థితిలో మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తుమ్మలచెరువు గ్రామానికి చెందిన నల్ల మేకల సైదమ్మ(55) ప్రతి రోజు లాగే ఆదివారమూ గేదెను మేతకు తోలుకొని పోయింది. అయితే సాయంత్రానికి ఆమె ఇంటికి తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలాల వైపు వెళ్లి పరిశీలించి చూడగా పత్తి పొలంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉండటాన్ని గుర్తించారు. వెంటనే పిడుగురాళ్ల పోలీసులకు సమాచారం అందించగా ఎస్ఐ మోహన్ ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలు గొంతుపై కర్రతో బలంగా నొక్కి ఉన్నట్లు ఉండటంతో సైదమ్మ ది హత్యగానే పోలీసులు భావిస్తున్నారు. పోలీసులు కుటుంబ సభ్యుల నుంచి వివరాలు తీసుకుంటున్నారు. సైదమ్మ కుటుంబ సభ్యుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు అన్ని కోణాలలో విచారణ చేస్తామని ఎస్ఐ మోహన్ ఈ సందర్భంగా తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.01 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	116, 124, 135
చికెన్ విత్ స్కిన్	218.00
చికెన్ స్కిన్ లెస్	228.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

పాలకుల నిరంకుశత్వమే ప్రజల తిరుగుబాటుకు కారణం

● ఎమ్మెల్సీ లక్ష్మణరావు



మాట్లాడుతున్న కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 18: బంగ్లాదేశ్ అధ్యక్షురాలు షేక్ హసీనా ప్రజల భావ ప్రకటన స్వేచ్ఛను హరించటం, నిరంకుశత్వంగా వ్యవహరించటమే ప్రజల తిరుగుబాటుకు కారణమని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. ఆదివారం, బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞానకేంద్రం హాల్లో స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఏపీ ఎంఎస్ఆర్‌యూ రాష్ట్ర నాయకుడు షేక్ అబ్దుల్ సలీమ్ అధ్యక్షతన 'బంగ్లాదేశ్ పరి ణామాలు- విశ్లేషణ' అనే అంశంపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో 8 శాతంగా ఉన్న హిందువులపై దాడులకు వ్యతిరేకంగా, హిందూ దేవాలయాలపై ఎలాంటి దాడులు జరగకుండా అక్కడి ముస్లిం ప్రజలు రక్షణగా నిలిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో స్టడీ సర్కిల్ బాధ్యులు జి.వెంకట్రావు, కె.నళినీకాంత్, ఈమని అప్పారావు, ఆనంద్‌కుమార్, కే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ చట్ట సవరణలను వ్యతిరేకించాలి

● అవాజ్ కమిటీ రాష్ట్ర సదస్సులో వక్తలు



మాట్లాడుతున్న న్యాయవాది జహీరా, అవాజ్ రాష్ట్ర కమిటీ నాయకులు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 18: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ చట్టాన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక బ్రాడీపేట, గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో ఆవాజ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో వక్ఫ్ చట్ట సవరణలను వ్యతిరేకిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎస్ సుభాన్ అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథులుగా సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయవాదులు సురేష్, బి.శ్రీనివాసరావు, న్యాయ నిపుణులు జహీరా హాజరై మాట్లాడుతూ మైనార్టీల వక్ఫ్ ఆస్తులు ప్రభుత్వ పరం చేస్తూ కలెక్టర్‌కు విచక్షణ అధికారాలు ఇవ్వడం సరైనది కాదన్నారు. చట్ట సవరణలతో మైనార్టీ హక్కులను కాలరాయడమేనని అన్నారు. సదస్సుల్లో ముస్లిం అడ్వకేట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మతిన్, జిల్లా అధ్యక్షుడు ఎస్కే బాషా, ఎండీ సలీం, ఖాజావలి, ముక్తి ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

క్రిమిలేయర్ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు వ్యతిరేకించాలి

● సీఎం చంద్రబాబుకు గోళ్ళ అరుణ్‌కుమార్ విజ్ఞప్తి

గుంటూరు, ఆగస్టు 18: ఎస్సీ రిజర్వేషన్‌లకు క్రిమిలేయర్ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు వ్యతిరేకించాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు, ఏపీ మాల సంఘాల జేఏసీ అధ్యక్షుడు గోళ్ళ అరుణ్‌కుమార్ సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో ఆదివారం సీఎం చంద్రబాబును, కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌లను కలిసి అరుణ్‌కుమార్ ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రిమిలేయర్ విధానం అనేది రిజర్వేషన్‌లను ఎత్తివేసే కుట్రలో భాగమేనని ఆందోళన వ్యక్తం చేశారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ కల్పించిన రాజ్యాంగ హక్కులను కాలరాసేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని విమర్శించారు. మాల, మాదిగలను చీల్చి రాజకీయ పబ్బం గడుపుకునేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు క్రిమిలేయర్ విధానాన్ని వ్యతిరేకించి, ఎత్తివేసేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు ఉన్నారు.



సీఎం చంద్రబాబుకు వినతిపత్రం అందజేస్తున్న గోళ్ళ అరుణ్‌కుమార్ తదితరులు

ప్రాంతీయ గ్రంథాలయానికి పోటీ పరీక్షల పుస్తకాల వితరణ

గుంటూరు(విద్య), ఆగస్టు 18: స్థానిక ఏసీ కళాశాల ఎదురుగా ఉన్న ప్రాంతీయ గ్రంథాలయానికి మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పోటీ పరీక్షల పుస్తకాలు ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ పావూరి రమేష్, కార్యదర్శి కోరిటిపాటి సతీష్, అధ్యక్షులు పావులూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు. తొలుత జిల్లా అటవీశాఖాధికారి పోతురాజు ఆధ్వర్యంలో గ్రంథాలయం ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థుల కోసం రూ. 8వేల విలువైన పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో పౌర గ్రంథాలయాల ఉప సంచాలకులు సీహెచ్ దీక్షితులు, గ్రంథాలయాధికారి ఎస్ వెంకటేశ్వరరావుపాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

యార్డులో గుమస్తా కుటుంబానికి స్నేహహస్తం



నిత్యావసరాలు, నగదు అందజేస్తున్న ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు

గుంటూరు, ఆగస్టు 18: ఇటీవల మృతి చెందిన మిర్చియార్డు గుమస్తా డేగల సతీష్‌బాబు కుటుంబానికి మిర్చి యార్డు స్నేహ హస్తం ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆపన్న హస్తం అందించింది. మృతుని కుటుంబానికి రూ.73,500లతో పాటు 100 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు కంది అర్జునరెడ్డి, తెలుగు మారుతీ ప్రసాద్, వేల మూరి సంజీవకుమార్, శిరసాని వెంకటరావు, మువ్వల ప్రతాప్‌కుమార్ తదితరులున్నారు.

నగరాభివృద్ధికి పక్కా ప్రణాళికలు సిద్ధం చేయాలి

● రెండు వారాల్లో సమీక్ష సమావేశం ఏర్పాటు చేయాలి

● కార్పొరేషన్ కమిషనర్‌తో డాక్టర్ పెమ్మసాని



కేంద్రమంత్రి డాక్టర్ పెమ్మసానిని కలిసిన కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు(కార్పొరేషన్), ఆగస్టు 18: నగరాభివృద్ధిపై పూర్తి దృష్టి సారించాలి.. రోడ్ల ప్యాచ్ వర్క్‌లు, శానిటేషన్ సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలి.. కార్పొరేషన్‌పై ఉన్న వ్యయభారం తగ్గించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి... అని కేంద్ర గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. గుంటూరులోని స్థానిక ఎంపీ క్యాంప్ కార్యాలయంలో పెమ్మసానిని కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా నగరంలోని పలు సమస్యలను ఇద్దరు చర్చించారు. రోడ్ల ప్యాచ్ వర్క్‌లు, పారిశుధ్య సమస్యలతో పాటు రెవెన్యూ వసూళ్లకు ఎదురవుతున్న ఇబ్బందులపై పలు వివరాలను మంత్రికి కమిషనర్ ఈ సందర్భంగా తెలియజేశారు. కార్పొరేషన్‌పై పడుతున్న రెవెన్యూ భారాన్ని తగ్గించి, జీఎంసీకి రావాల్సిన ఆదాయ వనరులపై దృష్టి పెట్టాలని కమిషనర్‌కు పెమ్మసాని సూచించారు. నగరాభివృద్ధితో పాటు ప్లాంటేషన్, పలు సుందరీకరణ కార్యక్రమాలను కూడా చేపట్టాలని రాబోయే 1-2 వారాల్లో పక్కా ప్రణాళికలను సిద్ధం చేయా లని ఆయన చెప్పారు. తద్వారా కార్పొరేషన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించాలని పెమ్మసాని ఈ సందర్భంగా ఆదేశించారు. కమిషనర్ మాట్లాడుతూ తాను ఇప్పటికే కొన్ని ప్రణాళికలు సిద్ధం చేశానని, రోజుల వ్యవధిలోనే ఆ ప్రణాళికలను అమలు పరిచి నగరాభివృద్ధికి సహకరిస్తానని మంత్రి పెమ్మసానికి వివరించారు.

నల్లచెరువులో మసీదుకు ఎమ్మెల్యేల శంకుస్థాపన



మదీనా మసీదుకు శంకుస్థాపన చేస్తున్న నసీర్, గల్లా మాధవి

గుంటూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): గుంటూరులోని నల్లచెరువు 20వ లైనులో నిర్మిస్తున్న మదీనా మసీదుకు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి ముస్లిం మత పెద్దలతో కలిసి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నసీర్ మాట్లాడుతూ నల్లచెరువులో నూతన మసీదుకు తన చేతుల మీదగా శంకుస్థాపన చేయడం చాలా ఆనందకరంగా ఉందని దాతలు ముందుకు వచ్చి ఐదు కోట్లతో మసీదు నిర్మాణానికి చేయందించారని, తన వంతు సాయంగా రూ.50 వేలు ఇస్తానని అన్నారు. గల్లా మాధవి మాట్లాడుతూ ఇలాంటి అదృష్టం తనకు కలగడం సంతోషంగా ఉందన్నారు. తనను గెలుపులో భాగమైన ముస్లింల రుణం తీర్చుకునే అవకాశం కలిగిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేత గల్లా రామచంద్రరావు పాల్గొన్నారు.

పలు కార్యక్రమాల్లో పాల్గొన్న గల్లా మాధవి

కొరిటిపాడు వైకుంఠధామం ఆరో వార్షికోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే గల్లా మాధవి పాల్గొన్నారు. నిర్వాహకులు చుక్కపల్లి రమేశ్ సోదరులు చేస్తున్న సేవల ను కొనియాడారు. అనంతరం అరండల్‌పేటలోని వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు సింహాద్రి కనకాచారితో కలిసి పాల్గొన్నారు. చుట్టుగుంట సెంటర్లోని పోలేరమ్మ దేవస్థానంలో అన్నదాన కార్యక్రమంలో భక్తులకు భోజనం వడ్డించారు.

మెకానిక్‌లకు తోడుగా ప్రభుత్వం : నసీర్

మెకానిక్‌లకు కూటమి ప్రభుత్వం తోడుగా ఉంటుందని ఎమ్మెల్యే నసీర్ అన్నా రు. ఆటోనగర్లో ఆదివారం జరిగిన లారీ మెకానిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆటోనగర్‌లోని డ్రైనేజీ, రోడ్డు, తాగునీటి సమస్యలు పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో విజ్ఞాన మందిరంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

గోరంట్ల కొండపై వాటర్ ప్రాజెక్టు పనులు వెంటనే చేపట్టాలి

● కౌన్సిల్లో చర్చకు రావడంతో స్పందించిన కమిషనర్

● క్షేత్రస్థాయిలో పరిశీలించిన పులి శ్రీనివాసులు



వాటర్ ప్రాజెక్టును పరిశీలించి, అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు(కార్పొరేషన్), ఆగస్టు 18: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని గోరంట్ల కొండ మీద రిజర్వాయర్ నిర్మాణ పనులు ప్రజా ప్రయోజనాల దృష్ట్యా యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కాంట్రాక్టర్, ఇంజనీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ప్రాజెక్టు పనుల నిర్లక్ష్యంపై ప్రశ్నించారు. దీంతో స్పందించిన కమిషనర్ ఆదివారం గోరంట్ల కొండమీద నిర్మాణ పనులు నిలిచిన రిజర్వాయర్‌ని పరిశీలించి సంబంధిత అధికారులకు, కాంట్రాక్టర్‌కు పనుల పురోగతిపై తగు ఆదేశాలు జారీ చేశారు. పనులు ప్రారంభించిన తర్వాత బిల్లుల బకాయిల చెల్లింపునకు వెంటనే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. శనివారం జరిగిన నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో ప్రజాప్రతినిధులు సదరు ప్రాజెక్టు ప్రాధాన్యత, జాప్యంపై కౌన్సిల్ దృష్టికి తెచ్చారన్నారు. ఇంజనీరింగ్ అధికారులు పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ వేగంగా జరిగేలా చూడాలని ఆదేశించారు. అనంతరం కొండ పక్కన ఉన్న కొండ బజార్‌లో ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకురాగా స్పందించిన కమిషనర్ ప్రజలు వివరించిన సమస్యల్లో తాగునీటి సమస్యను తక్షణం పరిష్కారం చేయాలని ఏఈని ఆదేశించారు. పర్యటనలో ఎస్ఈ శ్యాం సుందర్, డీఈఈ హనీఫ్, సతీష్, ఏఈ అనూష, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, కార్పొరేటర్ బాలాజీ, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

మెగాస్టార్ చిరంజీవి ప్రస్థానం ఉన్నతమైనది

● తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

గుంటూరు (మెడికల్), ఆగస్టు 18: మెగాస్టార్ చిరంజీవి ప్రస్థానం తెలుగు చిత్ర సీమలో ఎవరెస్ట్ శిఖరంలా ఉన్నతమైనదని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ కొనియాడారు. అఖిల భారత చిరంజీవి యువత వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల రవీంద్రబాబు ఆధ్వర్యంలో స్థానిక గోరంట్లలోని షిప్ కార్యాలయంలో ఆదివారం జరిగిన పద్మవిభూషణ్ చిరంజీవి ముందస్తు జన్మదిన వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా 60 మంది విద్యార్థులకు పౌష్టికాహారం కిట్లను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో మేకల రవీంద్రబాబు, షిప్ అధ్యక్షురాలు అల్లాడి రమాదేవి, జాస్తి వీరాంజనేయులు, మిరియాల ప్రసాదరావు, రమణమూర్తి, గిడుతూరి సత్యం, శంకర్‌రెడ్డి, చిమటా శ్రీనివాస్, సాయిశ్రీకర్, నాగరాజు, యుగంధర్, పులిగడ్డ నాగేశ్వరరావు, శ్రీకాంత్, ఆదిత్య మహంకాళి శ్రీనివాస్ తదతరులు పాల్గొన్నారు.

వయనాడ్ వరద బాధితులకై విరాళాల సేకరణ

గుంటూరు, ఆగస్టు 18: కేరళలోని వయనాడ్‌లో వరద బీభత్సానికి నిరాశ్రయులైన వారిని ఆదుకునేందుకు కాంగ్రెస్ విద్యార్థి అనుబంధ విభాగం ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో రూ.50,970లను చందాల రూపంలో సేకరించినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ కరీం తెలిపారు. కేరళలో నిరాశ్రయులను ఆదుకునేందుకు ఎన్ఎస్ యూఐ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు షేక్ కరీం వారి బృందం ఆధ్వర్యంలో వారం రోజుల నుంచి విరాళాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. చందాల రూపంలో వచ్చిన మొత్తాన్ని కేరళలో నిరాశ్రయులైన వారికి అందజేస్తామన్నారు. రాజీవ్‌గాంధీ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు కరీం, కార్యకర్తలను మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు అభినందించారు.

వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

గుంటూరు(తూర్పు), ఆగస్టు 18: గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో నియమించిన వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వలంటీర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జంగాల చైతన్య ఏపీ వలంటీర్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ రాజేష్‌లు అన్నారు. ఆదివారం కొత్తపేట మల్లయ్య లింగం భవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం నుంచి బకాయి పడ్డ రెండు నెలల గౌరవ వేతనాన్ని ఇప్పించాలన్నారు. రాజీనామా చేసిన వలంటీర్లను బలవంతపు రాజీనామాలుగా గుర్తించి తిరిగి విధుల్లోకి తీసుకోవాల న్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం వలంటీర్లకు న్యాయం చేయాలని, రూ.10 వేల గౌరవ వేతనం ఇచ్చి వలంటీర్లకి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉమా, షేక్ మున్నీరు, వలంటీర్లు పాల్గొన్నారు.



సాహితీవేత్తలను సత్కరిస్తున్న రావి రంగారావు తదితరులు

కరుణశ్రీ కవిత్వం కరుణాంతరంగం

● ప్రముఖ సాహితీవేత్త యర్రగుంట్ల పాణిరావు

గుంటూరు, ఆగస్టు 18: కరుణశ్రీ కవిత్వం కరుణాంతరంగం అని ప్రముఖ సాహితీవేత్త యర్రగుంట్ల పాణిరావు అన్నారు. గుంటూరు అమరావతి సాహితీ మిత్రుల ఆధ్వర్యంలో బ్రాడీపేటలోని సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించిన సాహిత్యసభలో ఆయన ప్రసంగించారు. సంస్థ అధ్యక్షుడు డాక్టర్ రావి రంగారావు అధ్యక్షత వహించిన సభలో 'ఈ మాసం కవి'గా కోసూరి జయసుధ (ఏలూరు) వివిధ అంశాలపై వినిపించిన కవితలు సభను విశేషంగా ఆకట్టుకున్నాయి. తరువాత ఫేస్ బుక్ 'అమరావతి సాహితీ మిత్రులు' గ్రూపులో మూడు నెలలపాటు 13 వారాలు నిర్వహించిన వచన కవితల పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 'వచన కవిత ప్రతిభ పురస్కారాల'ను కోసూరి జయసుధ (ఏలూరు)కు, డాక్టర్ నల్లాన చక్రవర్తుల సుధా మైథిలి (గుంటూరు)కు సంస్థ పక్షాన రావి రంగారావు, డాక్టర్ టి.సేవకుమార్, పాణిరావు, పూసపాటి తదితరులు అందజేశారు. పింగళి భాగ్యలక్ష్మి నిర్వహించిన 'దేశం ఎటు పోతున్నది' అనే అంశంపై కవితా పఠనంలో పూసపాటి కృష్ణ సూర్యకుమార్, చల్లా సత్యవతి (పిడుగురాళ్ల), బండి కల్లు జమదగ్ని, శరకణం కనకదుర్గ, షేక్ కాసింబి, సూర్యదేవర రవికుమార్, ధనుంజయ రెడ్డి, మైథిలి, గోలి హనుమచ్ఛాస్త్రి, వక్కలగడ్డ వెంకటేశ్వరరావు, బలభద్రపాత్రుని ఉదయ శంకర్, సదాశివన్ (హైదరాబాద్), మస్తాన్, సోమేపల్లి వీరాంజనేయులు, ఈవూరు వెంకటరెడ్డి (నరసరావుపేట) తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధత జీవనశైలితో గుండె జబ్బుల నివారణ

● డాక్టర్ కే హేమ సుందర్

గుంటూరు, ఆగస్టు 18: ఆరోగ్యకరమైన నియమ నిబద్ధమైన జీవనశైలితో గుండె జబ్బులను ఎదుర్కోవచ్చని సీనియర్ కార్డియాలజిస్టు డాక్టర్ కే హేమసుందర్ అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఆరోగ్యసభలో ఆయన ప్రసంగించారు. రక్తపోటు, మధుమేహం అదుపులో ఉంచుకొని మంచి జీవనశైలిని అనుసరిస్తే గుండెకు సంబంధించిన సమస్యలు దరి చేరవన్నారు. గుండె సంబంధిత సమస్యలు పెద్దవారిలో ఎక్కువగా ఉండేవని, కానీ ప్రస్తుతం యువతలో కూడా పెరగటం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఇటీవల శ్రమ లేమి, అనారోగ్యపు ఆహారపు అలవాట్లు, మానసిక ఒత్తిడి, ఇతర అనారోగ్య సమస్యల మూలంగా చిన్న వయసులోనే గుండె సమస్యలు వస్తున్నాయన్నారు. ప్రతి రోజూ వ్యాయామం చేయటం, ఆరోగ్యపు ఆహారంతో ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సాయిరామ్, రామచంద్రరావు, ఫణికుమార్, వీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

అలరించిన భక్తి సంగీత విభావరి

గుంటూరు(తూర్పు), ఆగస్టు 18: స్థానిక బృందావన్‌గార్డెన్స్ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై స్వరరాగ సుధ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన భక్తి సంగీత విభావరి ప్రేక్షకులను ఆకట్టుకుంది. తొలుత ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరు నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గాయనీ, గాయకులు కేవీ సాయిబాబా శర్మ, కృష్ణకుమారి తమ గాత్ర ధారణలో స్వామివారి, అమ్మవారి భక్తి గీతాలను శ్రావ్యంగా ఆలపించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు కళాకారులను ఘనంగా సత్కరించారు.

టీటీడీలో రెండు వేల కోట్లు గోల్‌మాల్

● అక్రమాలు కప్పిపుచ్చేందుకే అగ్నిప్రమాదాలు

● బ్రాహ్మణ చైతన్య వేదిక అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్

గుంటూరు, ఆగస్టు 18 : తిరుమల తిరుపతి దేవస్థానంలో రెండు వేల కోట్లు గోల్‌మాల్ జరిగిందని బ్రాహ్మణ చైతన్య వేదిక అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్ ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం ఆయన గుంటూరులో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల వేంకటేశ్వరస్వామికి సంబంధించిన గతంలో చైర్మన్‌గా పని చేసిన వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర్‌రెడ్డి చేసిన రెండు వేల కోట్ల రూపాయల భక్తుల సొమ్ము అవినీతి బాగోతం బయటకు రాకుండా ఉండేందుకు అగ్ని ప్రమాదాన్ని సృష్టించారన్నారు. దీనిపైన తక్షణమే హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరపా లని, దోషులు ఎంతటి వారైనా, అధికారులు ఉన్నా సరే చట్ట ప్రకారం శిక్షించాలని శ్రీధర్ కోరారు.

ఎన్నికల కౌంటింగ్ జరగక ముందే రాష్ట్ర సీఐడీ కార్యాలయంలో ఫైల్స్‌ను, హెరిటేజ్ సంస్థ పత్రాలను తగలబెట్టడం, ఆ తర్వాత ఎన్టీఆర్ జిల్లా గుడివాడలో ఫైల్స్ దగ్ధం చేయటం, ఆ తర్వాత పుంగనూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో అగ్ని ప్రమాదం సృష్టించటం, తాజాగా తిరుమలలోని టీటీడీ కార్యాలయంలో ఫైల్స్ తగలబెట్టడం ఇలా చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడగానే వైఎస్ జగన్‌ను, అప్పటి మంత్రులు, ఎమ్మెల్యేలను రక్షించడం కోసం ఉన్నత స్థాయి అధికారులే స్వయంగా ప్రమాదాలకు, దుశ్చర్యలకు పాల్పడుతున్నారని ఆరో పించారు. వారి పట్ల కూటమి ప్రభుత్వం ఉదాసీనత లేకుండా చర్యలు తీసుకొని ప్రభుత్వ శాఖల్లో వివిధ జిల్లాల్లో ఉన్న కార్యాలయాల్లో ఫైల్స్‌ని భద్రపరిచే విధంగా విజిలెన్స్ కమిటీ వేసి చర్యలు చేపట్టాలని శ్రీధర్ ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్ర మంలో వంగవీటి చైతన్య, ఎండపల్లి శబరి, వడ్డమాను ప్రసాదు, ఫణి తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో.. క్రికెట్ అభివృద్ధి

● ఏసీఏ నూతన అధ్యక్షుడు కేశినేని శివనాథ్(చిన్ని)



కేశినేని శివనాథ్(చిన్ని)ని సత్కరిస్తున్న టీడీపీ నాయకులు కనపర్తి, జిల్లా క్రికెట్ అసోసియేషన్ సభ్యులు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 18: జిల్లా క్రికెట్ అసోసియేషన్లతో కలిసి రాష్ట్రంలో క్రికెట్‌ను మరింతగా అభివృద్ధి చేయనున్నట్టు విజయవాడ ఎంపీ, ఆంధ్రా క్రికెట్ సంఘం (ఏసీఏ) నూతన అధ్యక్షుడు కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. గుంటూరు, బ్రాడీపేట, జిల్లా క్రికెట్ కార్యాలయంలో ఆదివారం అసోసియేషన్ సభ్యులను స్థానిక టీడీపీ నాయకులతో కలిసి ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. ఏసీఏ నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన నేపథ్యంలో జిల్లా అసోసియేషన్ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కేశినేని చిన్ని మీడియాతో మాట్లాడుతూ ఏసీఏలో రాజకీయాలు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంలో పాలకవర్గ సభ్యులు చేసిన అవకతవకలపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఏసీఏలో క్లీన్ క్రికెట్‌కు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నూతన పాలకవర్గంతో ఏసీఏ కొత్త స్వరూపాన్ని సంతరించుకుంటుందని అన్నారు. క్రీడాకారుల ప్రతిభ తప్ప ఇతర సిఫార్సులను ఒప్పుకోమని తెలిపారు. ప్యానల్‌లో ఉన్న 35 మంది సభ్యులు క్రికెట్ అభివృద్ధికి పాటుపడుతామని హామీ ఇచ్చారు. మంగళగిరిలో ఉన్న అంతర్జాతీయ క్రికెట్ మైదానంను అభివృద్ధి చేసి త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. గుంటూరులో స్థలంను అందజేస్తే నూతన స్టేడియం నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. అనంతరం జిల్లా క్రికెట్ అసోసియేషన్ సభ్యులు కేశినేని చిన్నిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు రమణమూర్తి, కార్యదర్శి రమేష్, సభ్యులు రామకృష్ణ పరమహంస, నాగరాజు. సీతాపతి, టీడీపీ నాయకులు కనపర్తి శ్రీనివాసరావు, చిట్టాబత్తుని చిట్టిబాబు, కొమ్మినేని కోటేశ్వరరావు, నూకవరపు బాలాజీ, గోళ్ల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు, పాల్గొన్న ముఠా కార్మికులు

సివిల్ సప్లైస్ కార్మికుల కూలీ రేట్లను పెంచాలి

గుంటూరు(తూర్పు), ఆగస్టు 18: సివిల్ సప్లైస్ కార్మికుల కూలీ రేట్లను పెంచాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.సురేష్‌బాబు అన్నారు. ఆదివారం స్థానిక రేగుల రాఘవయ్య భవన్లో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన ప్రసంగించారు. కార్మికుల కూలీ రేట్ల అగ్రిమెంట్ 8 నెలలు పూర్తయినా, ఇంతవరకు కూలీరేట్లు పెంచలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. యూనియన్ జిల్లా కార్యదర్శి రావుల అంజిబాబు మాట్లాడుతూ సెప్టెంబరు 1 నుంచి మూడు రోజుల పాటు వైజాగ్‌లో జరిగే ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కోట్ల మరియదాసు, కొండలు, రొయ్యల శ్రీను, బాబురావు, గోపి తదితరులు పాల్గొన్నారు.

24న గిరిరాజు కృష్ణమూర్తి స్మారక రాష్ట్ర క్యారమ్ పోటీలు

గుంటూరు(తూర్పు),ఆగస్టు 18: ఆంధ్ర స్టేట్ అసోసియేషన్, పల్నాడు జిల్లా క్యారమ్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 24, 25 తేదీల్లో సీఆర్ క్లబ్, చిలకలూరిపేటలో మహిళలు, పురుషులు విభాగాల్లో గిరిరాజు కృష్ణమూర్తి స్మారక 2వ ర్యాంకింగ్ క్యారమ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ జలీల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు తమ పేర్లను ఈనెల 20వ తేదీలోపు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 99511 15678ను సంప్రదించాలని సూచించారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

గుంటూరు, ఆగస్టు 18 : ద్విచక్ర వాహన చోరీలకు పాల్పడుతున్న గట్టుపల్లి ప్రదీప్ అనే వ్యక్తిని నల్లపాడు పోలీసులు అరెస్టు చేశారు. చిలకలూరిపేట టౌన్‌లోని క్రిష్టియన్ పేటకు చెందిన గట్టుపల్లి ప్రదీప్ అనే యువకుడు మద్యం, సిగరెట్లు వంటి చెడు అలవాట్లకు బానిసై తక్కువ సమయంలోనే డబ్బులు బాగా సంపాదించాలనే ఉద్దేశంతో కొంత కాలంగా గుంటూరు రూరల్ ప్రాంతంలో ద్విచక్ర వాహన దొంగతనాలకు పాల్పడ్డాడు. ఈ క్రమంలో పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు ప్రదీప్‌ను చిలకలూరిపేట రోడ్డులోని జంక్షన్ దగ్గర అదుపులోకి తీసుకొని అతని నుంచి మొత్తం ఆరు లక్షల 50 వేల ఖరీదైన 8 స్కూటీలను స్వాధీనపరుచుకొని నిందితుడిని రిమాండు నిమిత్తం కోర్టుకు హాజరుపరిచారు.



స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలతో నల్లపాడు సీఐ వంశీధర్

మైనర్‌లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే జైలుకే

● ద్విచక్ర వాహన చోదకులకు భారీగా జరిమానాలు

మైనర్‌లు వాహనాలు నడుపుతూ మరోసారి పట్టుబడితే ఈసారి జైలుకు వెళ్లడమేనని నల్లపాడు సీఐ వంశీధర్ హెచ్చరించారు. పోలీసులు ఆకస్మికంగా నిర్వహించిన నాకాబందీలో నిబంధనలకు విరుద్ధంగా నడుపుతూ పట్టుబడిన ద్విచక్ర వాహన చోదకులకు భారీ మొత్తంలో జరిమానాలు విధించారు. శనివారం సాయంత్రం పోలీసులు నిర్వహించిన నాకా బందిలో సరైన పత్రాలు లేని 198 ద్విచక్ర వాహనాలను నల్లపాడు పోలీ సులు సీజ్ చేసిన విషయం విదితమే. సీజ్ చేసిన వాహనాలను పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌కు తరలించారు. ఆయా వాహన చోదకులకు, వారి తల్లిదండ్రులకు నల్లపాడు సీఐ వంశీధర్ కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం పెద్ద మొత్తంలో ఆయా వాహన చోదకులకు ఆర్టీఏ అధికారులు జరిమానాలు విధించారు. వంశీధర్ మాట్లాడుతూ ప్రతి వారం ఆకస్మికంగా నాకాబందీ నిర్వహిస్తామన్నారు.

ఏపీపీఎస్సీ పోటీ పరీక్షల ప్రత్యేకం

రీజనింగ్

1. తేజకు అతని సోదరి నందిత పుట్టినరోజు జూలై 21 నుంచి జూలై 26 మధ్య అని గుర్తు. మరో సోదరుడు భవేష్‌కు వారి సోదరి పుట్టినరోజు జూలై 24 నుంచి 29 మధ్య అని గుర్తు. అయితే నందిత పుట్టినరోజు ఏ రోజు అవుతుంది?

ఎ) జూలై 26 బి) జూలై 25
సి) జూలై 24 డి) ఏదీకాదు

సమాధానం: (బి)

వివరణ: తేజకు అతని సోదరి పుట్టినరోజు జూలై 21 నుంచి 26 మధ్య అని గుర్తు. ఇచ్చిన తేదీలకు మధ్యలోని తేదీలు తీసుకోవాలి. 22, 23, 24, 25 భవేష్‌కు, సోదరి నందిత పుట్టినరోజు జూలై 24 నుంచి 29 మధ్య అని గుర్తు. ఇచ్చిన తేదీలకు మధ్యలోని తేదీలు 25, 26, 27, 28.

గమనించండి: రెండింటిలో కామన్‌గా ఉండే తేదీ '25' అనగా జూలై 25 సమాధానం అవుతుంది.

2. సాత్విక్‌కు అతని తల్లిదండ్రుల పెళ్లి రోజు అక్టోబర్ 7 నుంచి అక్టోబర్ 12 మధ్య అని గుర్తు. అతని సోదరి సౌమికకు వారి తల్లితండ్రుల పెళ్లిరోజు అక్టోబర్ 9 నుంచి అక్టోబర్ 4 మధ్య అని గుర్తు. అతని సాత్విక్, సౌమికల తల్లిదండ్రుల పెళ్లిరోజు అవుతుంది?

ఎ) అక్టోబర్ 10 బి) అక్టోబర్ 11
సి) అక్టోబర్ 10 లేదా 11 డి) ఏదీకాదు

సమాధానం: (సి)

వివరణ: సాత్విక్‌కు అతని తల్లిదండ్రుల పెళ్లి రోజు అక్టోబర్ 7 నుంచి 12కు మధ్య అని గుర్తు. ఇచ్చిన తేదీలకు

టైమ్ సీక్వెన్స్ టెస్ట్

మధ్య తేదీలు 8, 9, 10, 11. అతను సోదరి సౌమికకు వారి తల్లిదండ్రుల పెళ్లి రోజు అక్టోబర్ 9 నుంచి అక్టోబర్ 14కు మధ్య అని గుర్తు, ఇచ్చిన తేదీలకు మధ్య తేదీలు 10, 11, 12, 13.

గమనించండి: రెండింటిలో కామన్‌గా ఉన్న తేదీలు 10, 11. ఈ విధంగా రెండు తేదీలు వచ్చినప్పుడు అక్టోబర్ 10 లేదా అక్టోబర్ 11 (అనగా either, or)) సమాధానంగా గుర్తించాలి.

3. పవిత్రకు ఆమె సోదరి మేఘన పుట్టినరోజు జనవరి 20 నుంచి జనవరి 24 మధ్య అని గుర్తు. వారి మరో సోదరి మౌనికకు, మేఘన పుట్టినరోజు ఫిబ్రవరి 22, ఫిబ్రవరి 26ల మధ్య అని గుర్తు. అయిన పవిత్ర మౌనికల ప్రకారం వారి సోదరి మేఘన పుట్టినరోజు ఏ రోజు అవుతుంది?

ఎ) జనవరి 23 బి) ఫిబ్రవరి 23
సి) చెప్పలేం డి) ఏదీకాదు

సమాధానం: (సి)

వివరణ: పవిత్రకు ఆమె సోదరి మేఘన పుట్టినరోజు జనవరి 20 నుండి జనవరి 24 మధ్య అని గుర్తు. వారి మరోసోదరి మౌనికకు, మేఘన పుట్టినరోజు ఫిబ్రవరి 22, ఫిబ్రవరి 24ల మధ్య అని గుర్తు.

గమనించండి: ఇద్దరి సమాచారం ప్రకారం నెలలు వేర్వేరుగా ఉన్నాయి. దాదాపు 30 రోజుల తేడా ఉన్నది. కావున సమాధానం చెప్పలేం అవుతుంది.

4. ఒక బస్సు వరంగల్‌కు ప్రతి 45 ని.లకు ఉంది. విచారణాధికారి తనను కలిసిన ప్రయాణికునితో బస్సు వెళ్ళిపోయి 15 ని. అయింది. తరవాత బస్సు 11.30 ఎ.ఎం. అని చెప్పారు. అయిన ఈ సమాచారాన్ని విచారణాధికారి ప్రయాణికునితో ఏ సమయంలో చెప్పారు?

ఎ) 10.50 ఎ.ఎం. బి) 11.00 ఎ.ఎం.
సి) 11.10 ఎ.ఎం. డి) 11.15 ఎ.ఎం.

సమాధానం: (బి)

వివరణ: బస్సు వరంగల్‌కు ప్రతి 45 ని. ఉంది. తదుపరి బస్సు వచ్చే సమయం గం. 11.30 ని. అనగా ముందు బస్సు వచ్చిన సమయం 11.30-45 ని. = గం. 10.45 ని. విచారణాధికారి ప్రయాణికునితో బస్సు వెళ్ళిపోయి 15 ని. అయింది అని చెప్పారు. దాని అర్థం ప్రయాణికుడు 15 ని. ఆలస్యంగా వచ్చాడు. (ఆలస్యంగా వస్తేనే కదా బస్సు వెళ్ళి పోయింది) కాబట్టి విచారణాధికారికి, ప్రయాణికునికి మధ్య సంభాషణ జరిగిన సమయం 10.45+15 ని.= 11.00 ఎ.ఎం. అవుతుంది.

5. ఒక కార్యాలయంలో 30 మంది ఉద్యోగులు ఉన్నారు. 10 మంది ఉద్యోగులు మొదటి గ్రూపుగా ఉదయం 7 గం.ల నుంచి మధ్యాహ్నం 1.00 గం. వరకు పని చేస్తారు. 12 మంది వ్యక్తులు రెండో గ్రూపుగా ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 3.00 గం. వరకు పనిచేస్తారు. 8 మంది వ్యక్తులు మూడో గ్రూపుగా ఉదయం 11.00 గం.ల నుంచి సాయంత్రం 5 గం. పనిచేస్తారు. అయితే కార్యాలయంలోని ఉద్యోగులందరూ ఏ సమయం నుంచి ఏ సమయం వరకు కలుసుకుంటారు?

ఎ) 11.00 ఎ.ఎం. నుంచి 1.00 పి.ఎం.



బి) 10 ఎ.ఎం. నుంచి 12 మధ్యాహ్నం
సి) 1 పి.ఎం. నుంచి 3 పి.ఎం. డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ: కార్యాలయంలో ఉద్యోగులందరు కలుసుకునే సమయం అనగా మూడు గ్రూపుల వారికి కామన్ టైమ్ తీసుకోవాలి. మొదటి గ్రూపు పని చేసే వేళలు 7.00 ఎ.ఎం. నుంచి 1.00 పి.ఎం.వరకు అనగా 7-8, 8-9, 9-10, 10-11, 11-12, 12-11

రెండో గ్రూపువారు పనిచేసే వేళలు 9.00 ఎ.ఎం. నుంచి 3.00 పి.ఎం. వరకు అనగా 9-10, 10-11, 11-12, 12-1, 1-2, 2-3. మూడో గ్రూపువారు పనిచేసే వేళలు 11.00 ఎ.ఎం. నుంచి 5.00 పి.ఎం. వరకు అనగా 11-12, 12-1, 1-2, 2-3, 3-4, 4-5. గమనించండి: మూడు గ్రూపులలో కామన్ టైమ్ 11 నుంచి 1 వరకు అని తెలుస్తున్నది. కాబట్టి మూడు గ్రూపులు కార్యాలయంలో కలిసి పనిచేసే వేళలు 11.00 ఎ.ఎం. నుంచి 1.00 పి.ఎం. సమాధానం అవుతుంది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్,
సీనియర్ ఫ్యాకల్టీ



కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

ఎస్సీ ఉప వర్గీకరణ
సుప్రీంకోర్టు తీర్పు-నేపథ్యం

భారతీయ సమాజంలో అసమానతలకు బీజం వేసింది నాలుగంచెల చాతుర్వర్ణ వ్యవస్థ. ఎగువ అంచెల వారి కి పాలనాధికారాన్ని, ప్రతిష్ఠను కట్టబెట్టి దిగువ అంచెల వారిని వారికి సేవకులను చేసింది. అన్నింటికన్నా దిగువ అంచె అయిన శూద్రుల్లో సేవక కులాలనన్నింటినీ జమచేయడం జరిగింది. వారి వృత్తులను బట్టి కాలక్రమంలో శూద్రుల్లో కూడా స్థాయీ భేదాలు వచ్చాయి. కొన్ని పనులు చేసేవారు అంటరాని వారయ్యారు. ఊరిలోని మాలిన్యాన్ని తొలగిస్తూ, అందరి ఆరోగ్యాన్ని పరిరక్షిస్తూ తాము మాత్రం ఊరవతలకే పరిమితమయ్యారు. కనీస అవసరాలకు నోచుకోలేదు. కాలక్రమంలో వీరే దళితులుగా పిలువబడ్డారు.

స్వాతంత్ర్యానంతరం భారత రాజ్యాంగం దళితులు, ఆదివాసీలు, ఇతర వెనుకబడిన శూద్ర కులాల వారి అభ్యున్నతికి విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించడం ద్వారా వారి పురోభివృద్ధికి బాటలు వేసింది. అయితే దళితులను(మాల, మాదిక, వారి ఆశ్రిత కులాలను) షెడ్యూల్డ్ క్యాస్ట్, వివిధ ఆదివాసీ జాతులను షెడ్యూల్డ్ ట్రైబ్స్‌గా పేర్కొంటూ మూకుమ్మడి రిజర్వేషన్లను రెండు వర్గాల్లో అమలు చేశారు. అయితే తదనంతర కాలంలో అనగా 90ల్లో ఇతర వెనుకబడిన కులాలకు కల్పించిన రిజర్వేషన్లలో అన్ని వర్గాలకూ రిజర్వేషన్లు మూకుమ్మడిగా కాక, ఆయా ఉపవర్గాల్లో వెనుకబాటుతనం ఆధారంగా, ఇతర వెనుకబడిన తరగతులను(ఓబీసీ) హేతుబద్ధీకరించి ఏ, బీ, సీ, డీ, ఇ లుగా వర్గీకరించి రిజర్వేషన్లను అమలుచేశారు. ఈ వర్గీకరణ ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో అనుసరించలేదు. దీని కారణంగా ఎస్సీ, ఎస్టీ వర్గాల్లోని కొన్ని ఆధిపత్య కులాలు, జనాభాపరంగా తక్కువ సంఖ్య ఉన్న కులాలు రిజర్వేషన్ ఫలాలను ఎక్కువగా పొందాయి. క్రమంగా వారి తరవాతి తరాలూ ఈ లబ్ధిని కొల్లగొట్టాయి. ఓబీసీల మాదిరి క్రిమిలేయర్ విధానం కూడా ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో లేకపోవడంతో అభివృద్ధి చెందిన ఉప కులాలే మరింత రిజర్వేషన్లు ఉపయోగించుకుని అభివృద్ధి చెందారు. ఇతర ఉపకులాలు అణగారిపోయారు. ఎస్సీ, ఎస్టీల్లోని అనేక కులాలు, ఆశ్రిత కులాల్లో దీనిపై అసంతృప్తి ఉన్నప్పటికీ తొలిసారి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీల్లోని మాదిగ కులం వారిలో చైతన్యం వచ్చింది.

> **90ల్లో ఇతర వెనుకబడిన కులాలకు కల్పించిన రిజర్వేషన్లలో అన్ని వర్గాలకూ రిజర్వేషన్లు మూకుమ్మడిగా కాక, ఆయా ఉపవర్గాల్లో వెనుకబాటుతనం ఆధారంగా, ఇతర వెనుకబడిన తరగతులను(ఓబీసీ) హేతుబద్ధీకరించి ఏ, బీ, సీ, డీ, ఇ లుగా వర్గీకరించి రిజర్వేషన్లను అమలుచేశారు.**

ఎస్సీ ఉపవర్గీకరణ పోరాట పుట్టినిల్లు తెలుగుగడ్డ

అనాదిగా చర్మకారులుగా అట్టడుగు స్థాయిలో ఉన్న మదిగవారు, తమ తోటి ఉపవర్గం వారితో కూడా అంటరానివారిగా చూడబడ్డారు. తమకన్నా సామాజికంగా ముందున్న మాల వారితో కలిసి ఉమ్మడిగా అవకాశాలు పంచుకోవాల్సి రావడం అన్యాయంగా గుర్తెరిగారు.

జనాభాపరంగా తమకంటే తక్కువ సంఖ్యలో ఉన్న మాల వారు ఉమ్మడి రిజర్వేషన్లు కారణంగా ఎక్కువ లబ్ధి పొందుతున్నారని గ్రహించారు. తమకు ప్రత్యేకంగా రిజర్వేషన్లు అమలుచేయాలని ఏడో దశకం నుంచి ప్రభుత్వాలకు వినతులు సమర్పిస్తున్నారు. అయితే 1994లో 'మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి' ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా ఈదుమూడిలో మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఏర్పాటైన నాటినుంచి ఎస్సీ ఉపవర్గీకరణ పోరాటం ఉద్యమ స్థాయిని అందుకుంది. తమ పోరాటానికి 'మాదిగ దండోరా' ఉద్యమంగా నామకరణం చేశారు. వరుసగా భారీఎత్తున దండోరా సభలు, ర్యాలీలు నిర్వహించారు. ఎస్సీల్లో ఉపకులాలను వారి సామాజిక స్థాయి, జనాభా ఆధారంగా వర్గీకరించి ఎస్సీ రిజర్వేషన్లను ఏ, బీ, సీ, డి అనే కేటగిరీలుగా అమలు చేయాలని కోరారు. అన్ని రాజకీయ పార్టీలు, సమాజం నుంచి మద్దతు కూడగట్టారు.

ఈ ఉద్యమఫలంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1996లో జస్టిస్ రామచంద్రరాజు కమిషన్‌ను ఏర్పాటుచేసి సమస్య పరిష్కారానికి సూచనలు కోరింది. 1997లో ఈ కమిషన్ ఎస్సీలను ఏ, బీ, సీ, డీ కేటగిరీలుగా వర్గీకరించి రిజర్వేషన్ ఫలాలు అట్టడుగు వర్గాలకు చేరేవిధంగా చర్యలు తీసుకోమని సూచించింది. తత్ఫలితంగా 1997 జూన్ 6న అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎస్సీలకు ఉన్న 15% కోటాను ఏ, బీ, సీ, డీ వర్గాలుగా విభజిస్తూ ఒక జీవోను విడుదల చేసింది. ఏ గ్రూపులో రెల్లి, దాని అనుబంధ కులాలను చేర్చి 1 శాతం కోటాను, బీ గ్రూపులో మాదిగ, దాని ఉప కులాలను చేర్చి 7శాతం కోటా, సీ గ్రూపులో మాల, దాని ఉపకులాలను చేర్చి 6శాతం కోటా, డీ గ్రూపులో ఆది ఆంధ్రులతో పాటు ఇతర కులాలను చేర్చి 1 శాతం కోటాను ఇచ్చారు. ఈవిధంగా ఏ గ్రూపును ఎస్సీల్లో అట్టడుగు కులాల గ్రూపుగా తదుపరి బీ, సీ, డీలను క్రమానుగతంగా దాని పైస్థాయి గ్రూపులుగా వర్గీకరించి ఎస్సీ రిజర్వేషన్లలో కోటాను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అయితే మాలలు ఈ విధానానికి వ్యతిరేకంగా ఉద్యమించారు. మాల మహానాడు సంఘం ఈ రిజర్వేషన్ వర్గీకరణను న్యాయస్థానంలో సవాలు చేసింది.

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ జీవో రాజ్యాంగ విరుద్ధమని, రాష్ట్రప్రభుత్వ అధికార పరిధిలో లేని విషయమని తీర్పు ఇవ్వడంతో మళ్లీ సమస్య మొదటికి వచ్చింది. తదుపరి మరలా ఎంఆర్‌పీఎస్ పోరుబాట పట్టింది. దీంతో 2000 సంవత్సరంలో అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'ఎస్సీ రిజర్వేషన్ల హేతుబద్ధీకరణ చట్టం' ద్వారా తిరిగి ఎస్సీ ఉప వర్గీకరణను ప్రవేశపెట్టింది. 2004 నవంబరు వరకూ ఈవిధంగా ఎస్సీ ఉప వర్గీకరణ చట్టం అమలులో ఉంది. 2004లో ఇ.వి.చెన్నయ్య వర్సెస్ స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కేసులో 5గురు సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనం ఎస్సీ ఉప వర్గీకరణ చెల్లదని, ప్రకరణ 341(1) ప్రకారం రాష్ట్రపతి ఉత్తర్వుల మేరకు సజాతీయ కులాలను ఎస్సీలుగా వర్గీకరించారని, దానిని తిరిగి ఉప వర్గీకరించే అధికారం రాష్ట్రప్రభుత్వాలకు లేదని తీర్పునిచ్చింది. దీంతో మరలా కథ మొదటికి వచ్చింది. తిరిగి ఎంఆర్‌పీఎస్ ఉద్యమించడంతో అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎస్సీ ఉప వర్గీకరణకు పార్లమెంటు రాజ్యాంగ సవరణ చట్టం తీసుకురావాల్సిందిగా కోరుతూ అసెంబ్లీలో ఒక తీర్మానం చేసింది. దీంతో కేంద్రం 2007లో ఉషామెహ్రా కమిషన్‌ను ఏర్పాటుచేసి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ ఉపవర్గీకరణ అంశానికి సంబంధించి ఎదురయ్యే రాజ్యాంగ, చట్టపరమైన అవరోధాలను పరిశీలించి తగిన సూచనలు చేయాల్సిందిగా కోరింది. 2008లో నివేదిక సమర్పించిన ఈ కమిషన్ రాజ్యాంగ ప్రకరణ 341కి క్లాజ్ 3ని చేర్చి, రాజ్యాంగాన్ని సవరించడం ద్వారా రాష్ట్ర అసెంబ్లీలు ఏకగ్రీవ తీర్మానం చేసినప్పుడు పార్లమెంటు ఆమోదించే అవకాశాన్ని ఏర్పాటు చేయవచ్చని సూచించింది. ఈ సూచనలు అమలుకు నోచుకోలేదు.

(మిగతా రేపటి దిక్సూచిలో)



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

విజయకీలాద్రిపై భూవరాహ జయంతి

తాడేపల్లి టౌన్, ఆగస్టు 18: త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయరు స్వామి మంగళశాసనాలతో విజయకీలాద్రి దివ్యక్షేత్రంలో ఆదివారం భూవరాహ జయంతి వైభవంగా జరిగింది. స్వామి వార్లకు నివేదన, నక్షత్ర హారతి సేవ, తీర్థ ప్రసాదగోష్టి కార్యక్రమాలు జరిగాయి. చిన్న జీయర్ ఆశ్రమ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు కళ్యాణంలో పాల్గొని స్వామి వారి అనుగ్రహాన్ని పొందారు. అర్చకులు శ్రీనివాసాచార్యులు, అనంతస్వామి, వేద విద్యార్థులు పాల్గొన్నారు.



కళ్యాణమూర్తులుగా భూవరాహస్వామి, అమ్మవారు

సీతారామచంద్రస్వామి ఆలయ దశమ వార్షికోత్సవం

దుగ్గిరాల, ఆగస్టు 18: దుగ్గిరాలలోని రామ్‌నగర్‌లోని సీతారామచంద్ర స్వామి వారి ఆలయ దశమ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. నాగేశ్వరం యుగంధర్‌శర్మ ఆధ్వర్యంలో చయనం యశ్వంత్, కొలకలూరు విశ్వనాథ్ తదితరులు ఉదయం గణపతిహోమం, శ్రీరామ మూలమంత్ర హవనం, నవగ్రహ హవనం, పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కంచర్ల వెంకటేశ్వరరావు, సూరగాని నవీన్, వాకా నాగరాజు పర్యవేక్షణలో శ్రీరామ సూరగాని కల్యాణ్, అనూష, యడవలి గోపి, రాజ్యలక్ష్మి, అట్ల గంగాధర్, సౌజన్య దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో వార్షికోత్సవంలో పాల్గొన్నారు.

ఆర్జీకర్ ఘటనకు వ్యతిరేకంగా కొనసాగుతున్న నిరసనలు

- ఎయిమ్స్ వైద్యులు, విద్యార్థుల ర్యాలీ, మానవహారం
- బీసీ సంక్షేమసంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన

మంగళగిరి సిటీ, ఆగస్టు 18: కలకత్తా ఆర్జీకర్ వైద్యకళాశాలలో వైద్య విద్యార్థినిపై జరిగిన హత్యాచారాన్ని ఖండిస్తూ నగరంలో ఆదివారం కూడా ఆందోళనలు కొనసాగాయి. స్థానిక ఎయిమ్స్ ఆసుపత్రి వైద్యులు, వైద్య విద్యార్థులు కలిసి ఆదివారం నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎయిమ్స్ ఆసుపత్రి ప్రాంగణం నుంచి ఆరంభమైన ఈ నిరసన ర్యాలీ అంబేద్కర్ సెంటర్ వరకు సాగింది. ఘటనకు పాల్పడిన నిందితులందరినీ అరెస్టుచేసి కఠినంగా శిక్షించాలని, వైద్యులకు ప్రభుత్వం ప్రత్యేక రక్షణ కల్పించాలని ఈ సందర్భంగా నినాదాలు చేశారు. అనంతరం అంబేద్కర్ సెంటర్ వద్ద ఫ్లాష్ మాబ్ నిర్వహించారు. ఈ సందర్భంలో అందరూ కలిసి మానవహారంగా ఏర్పడి కొవ్వొత్తులు వెలిగించి తమ నిరసనను ప్రదర్శించారు. కార్యక్రమాల్లో ఎయిమ్స్ వైద్యులు, ఇంటర్న్ వైద్య విద్యార్థులు, ప్రజారోగ్యవేదిక ప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

కోల్‌కతా ఘటనను ఖండిస్తూ తక్షణమే నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి వెలిగించిన కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. స్థానిక లక్ష్మీ నరసింహస్వామివారి దేవస్థానం నుంచి ఆరంభమైన ఈ ర్యాలీ అంబేద్కర్ సెంటర్ వరకు కొనసాగింది. ర్యాలీలో ప్రదర్శకులు కొవ్వొత్తులను వెలగించి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్ మాట్లాడుతూ దేశంలో మహిళల పట్ల అకృత్యాలు పెరగడం చాల ఆందోళన కలిగిస్తుందన్నారు. ఈ దృష్ట్యా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నేరానికి పాల్పడిన వ్యక్తులను యుద్ధప్రాతిపదికన అరెస్టుచేసి అత్యంత కఠినంగా శిక్షించడం ద్వారా ఈ తరహా నేరాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. అలాగే మహిళల రక్షణకు మరింత కఠినమైన చట్టాలను తీసుకురావాలని మహేష్ కేంద్రప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమసంఘం జిల్లా కోఆర్డినేటర్ కాగితాల స్వాతిగౌడ్, రాష్ట్ర యువజన కార్యదర్శి కొల్లూరు హనుమంతరావు, ఉప్పాల రాజ్‌కిరణ్, ఉడతా శ్రీనివాసరావు, తిరువీధుల కిరణ్, ఆలా శివాజీ యాదవ్, ఎనుముల నరసింహరావు, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కలకత్తా ఆర్జీకర్ ఘటనకు నిరసనగా మంగళగిరిలో ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడిన ఎయిమ్స్ వైద్యులు, విద్యార్థులు

పశ్చిమ డెల్టా కాల్వకు 7837 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, ఆగస్టు 18: విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టా కాల్వకు 7837 క్యూసెక్కుల సాగునీటిని ఆదివారం విడుదల చేసినట్లు నీటి పారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 12.0 అడుగుల నీటి మట్టం ఉండగా దిగువకు 36,150 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.. దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్ ఛానల్‌కు 336 క్యూసెక్కులు, రేపల్లె కాల్వకు 1861 క్యూసెక్కులు, తూర్పు కాల్వకు 765 క్యూసెక్కులు, పశ్చిమ కాల్వకు 280 క్యూసెక్కులు, నిజాంపట్నం కాల్వకు 450 క్యూసెక్కులు, కొమ్మమూరుకాల్వకు 3040 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

రాష్ట్ర స్థాయి శతాధిక కవి సమ్మేళనం

ఫిరంగిపురం, ఆగస్టు 18: తెలుగుభాషా దినోత్సవాన్ని పుర స్కరించుకొని ఈనెల 25వ తేదీన ఉదయం 9 నుంచి సాయం త్రం 6గంటల వరకు కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్టు కొండవీడు రచయితల సంఘం ఫిరంగిపురం అధ్యక్షుడు సయ్యద్ మహమ్మద్ రఫీ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ తోళ్ళమడుగు గోవిందయ్యలు ఆదివారం తెలిపారు. ఫిరంగిపురంలోని వేణుగోపాల స్వామి కల్యాణ మండపంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కవులు, రచయితలకు భోజన వసతి, శాలువా, జ్ఞాపిక, ప్రశంసాపత్రం ఇచ్చి గౌరవించనున్నామన్నారు. ఆసక్తి గల కవులు, రచయితలు 9032380696, 9966385583 నెంబర్లకు ఫోన్ చేసి పేర్లను నమోదు చేసుకోవాలని వారు కోరారు.

ఇసుక అక్రమ రవాణా ట్రాక్టర్ స్వాధీనం

తుళ్లూరు, ఆగస్టు 18: మండలపరిధిలోని రాయపూడి ఇసుక రీచ్ నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను తుళ్లూరు పోలీసులు ఆదివారం తెల్లవారుజామున స్వాధీనం చేసుకున్నారు. రాయపూడి రీచ్ నుంచి అక్రమంగా ఇసుక తరలింపుపై ఆంధ్రజ్యోతిలో రెండు రోజుల క్రితం వార్త ప్రచురితమైంది. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. నిఘా పెట్టి అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం తెల్లవారుజా మున పటుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు సీఐ గంగా వెంకటేశ్వరావు తెలిపారు.

పెదపలకలూరులో ఘనంగా పోలేరమ్మ జాతర

గుంటూరు, ఆగస్టు 18 : పెదపలకలూరులో 4రోజులుగా జరుగుతున్న పోలేరమ్మ ఆలయ 15వ వార్షికోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఆదివారం ఉదయమే అమ్మవారికి గ్రామస్థులు పొంగలి సమర్పించారు. తరువాత గ్రామంలోని మహిళలందరూ మేళతాళాలతో, డప్పులతో వెళ్లి వడపప్పు, పానకం, కొబ్బరికాయలు మహాలక్ష్మి అమ్మవారికి సమర్పించారు. పిదప పోలేరమ్మకు సురాభాండం తీసుకొచ్చి వారుపోసి గ్రామంలోని స్త్రీలు, పురుషులు పొంగళ్ల నైవేద్యం సమర్పించారు. వర్షాలు సమవృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, గ్రామం సుఖశాంతులతో ఉండాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా వేలమందికి అన్న సంతర్పణ చేశారు. ఉప్పు రామారావు, కందుల మరియమ్మ, కొండలు, అంకమ్మరావు తదితరులు పాల్గొన్నారు.



230 మందికి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

పెదనందిపాడు, ఆగస్టు 18 : స్థానిక పీఏఎస్ కళాశాలలో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ హైదరాబాద్ వారి సహకారంతో జస్టిస్ లావు నాగేశ్వరరావు స్ఫూర్తితో ఆదివారం క్యాన్సర్ నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని జేఎన్‌టీయూ సీనియర్ అధ్యాపకులు మక్కెన మాధవీలత, పారిశ్రామికవేత్త దాసరి శేషగిరిరావులు ప్రారంభించారు. హాస్పిటల్ వైద్యులు డి.రవిశంకరప్రసాద్, శ్రావణికుమారి, సులోచనరాణి, సుమేనాలు 230 మందికి స్కానింగ్, ఎక్స్‌రే, మెమోగ్రఫీ, పాప్‌స్మియర్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవిశంకరప్రసాద్ మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులు, జీవన విధానం, ఆహారపు అలవాట్ల వల్ల క్యాన్సర్ వ్యాధి సోకుతుందని, మొదటి దశలో గుర్తించి తగు జాగ్రత్తలు తీసుకుంటే కాన్సర్‌ను జయించవచ్చునని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో 1500 శిబిరాలు నిర్వహించి, అవగాహనా కార్యక్రమాలు ఏర్పాటు చేయడంతో పాటు నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్వో పావినేని ఆదిత్య, మీడియా కోఆర్డినేటర్ లక్ష్మణ్, నిర్వాహకులు రావి శివరామకృష్ణయ్య, లావు తిరుమల ప్రసాద్, కుర్రా హరిబాబు, లావు శ్రీనివాసరావు, శివరామకృష్ణ, జవహర్‌రాణి, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న పారిశ్రామికవేత్త దాసరి శేషగిరిరావు

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మంగళగిరి, ఆగస్టు 18: స్థానిక కొత్త బస్టాండ్ సమీపంలో రోడ్డుపై ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉండడాన్ని స్థానికులు కనుగొని ఆదివారం సాయంత్రం పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి వయసు సుమారుగా 40 నుంచి 45 ఏళ్ల మధ్య ఉంటుంది. బ్లూజీన్ ప్యాంటు, ఫుల్ హ్యాండ్ చేతుల గళ్ల చొక్కా ధరించి ఉన్నాడు. ఎవరైనా మృతి చెందిన వ్యక్తిని గుర్తిస్తే మంగళగిరి పట్టణ పోలీసులకు సమాచారాన్ని అందించాలని సీఐ వినోద్‌కుమార్ తెలిపారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మిషన్లు



మహిళలకు కుట్టు మిషన్లు, గ్రైండర్లు అందజేస్తున్న నూతలపాటి త్రిలోక్

ప్రత్తిపాడు, ఆగస్టు 18: లయన్స్ క్లబ్ ఆఫ్ ప్రత్తిపాడు ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మిషన్లు, గ్రైండర్లను ఆదివారం పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ప్రత్తిపాడు అధ్యక్షుడు నూతలపాటి త్రిలోక్ ఆధ్వర్యంలో 50 శాతం సబ్సిడీపై చేతి వృత్తులు చేసుకునే మహిళలకు వీటిని పంపిణీ చేశారు. 20 మంది మహిళలకు కుట్టు మిషన్లు, ముగ్గురికి గ్రైండర్లను అందజేశారు. ఈ సందర్భంగా త్రిలోక్ మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వావలంబన కోసం లయన్స్ క్లబ్ ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. కార్యక్రమంలో నూతలపాటి అమర్‌నాద్, అంకాళం కోటేశ్వరరావు, పాలేటి రాజ, నూర్‌బాషా హుస్సేనా, అబ్దుల్ రజాక్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగుయువత ఆధ్వర్యంలో నేతాజీకి ఘన నివాళి

తుళ్లూరు, ఆగస్టు 18: తుళ్లూరు పార్టీ కార్యాలయంలో నేతాజీ సుభాష్ చంద్ర బోస్ చిత్రపటానికి పూలమాల వేసి టీడీపీ యువత సభ్యులు ఘనంగా నివాళి అర్పించారు. టీడీపీ తాడికొండ నియోజకవర్గ ఆర్టీఎస్ కోఆర్డినేటర్ నెలకుదిటి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యువత సభ్యులు దొండపాటి సుభాకర్, గొట్టిముక్కల రాజేష్, కంసాని రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



నేతాజీకి నివాళి అర్పిస్తున్న తెలుగుయువత సభ్యులు

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



వ్యర్థాలు నిలిచి ఉన్న కాలువ

కాలువల్లో వ్యర్థాలు తొలగించరూ..!

తెనాలి రూరల్, ఆగస్టు 18: పట్టణంలోని చినరావూరు రైల్వేస్టేషన్ వద్ద నుంచి ఐటీఐ కాలేజ్ రోడ్డులోని మురుగు కాలువలో కల్వర్టులు, తూములు ఉన్న ప్రాంతాల్లో వ్యర్థాలతో నిండుకున్నాయి. ఫలితంగా నీటి పారుదలకాక రోజుల తరబడి వ్యర్థాలు నిలిచి ఉండటంతో దోమలు ఉధృతి పెరగటంతోపాటు దుర్గంధం వెదజల్లుతోందని ఆ ప్రాంత వాసులు వాపోతున్నారు. మునిసిపాలిటీకి సకాలంలో పన్నులు చెల్లింపులు చెల్లిస్తున్నా తమ కాలనీపై దృష్టిపెట్టకపోవడం తగదన్నారు. తక్షణమే అధికారులు స్పందించి కాలవలో వ్యర్థాలు తొలగించి నీటి పారుదల సక్రమంగా జరిగి పరిశుభ్ర వాతావరణం నెలకొనేలా చూడాలని కోరుతున్నారు.



పోటీలను ప్రారంభించి మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆలపాటి

పవర్ లిఫ్టింగ్ పోటీలలో సత్తా చాటాలి

● మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్

తెనాలి అర్బన్, ఆగస్టు 18: పవర్ లిఫ్టింగ్ పోటీల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయికి చేరి తెనాలి క్రీడాకారులు సత్తా చాటాలని మాజీమంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ చెప్పారు. బస్‌స్టేషన్ సమీపంలోని క్విక్ జిమ్‌లో జిల్లా పవర్ లిఫ్టింగ్ సబ్ జూనియర్, జూనియర్, సినియర్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ పోటీలను ప్రారంభించి మాట్లాడుతూ, ఈ రంగంలో కూడా మంచి క్రీడాకారులకు శిక్షణ ఇచ్చే కోచ్‌లు ఉండటం అభినందనీయమన్నారు. బీజేపీ నాయకులు పాటిబండ్ల రామకృష్ణ, తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, విజయభాస్కరరావు, సంధాని, నిర్వాహకురాలు ఘట్టమనేని సాయిరేవతి, భార్గవ్ కుమార్, శివరామకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

హంతకులను కఠినంగా శిక్షించాలి

● పీహెచ్‌సీ వైద్యాధికారి సుబ్బారావు

తెనాలి రూరల్ ఆగస్టు 18: కలకత్తాలో మహిళా జూనియర్ డాక్టర్‌ను హత్యాచారంచేసి అతికిరాతకంగా హత్యచేసిన నిందితులకు కఠిన శిక్ష విధించాలని కొలకలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి సుబ్బారావు డిమాండ్ చేశారు. ఆదివారం కొలకలూరు పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీలతో కలిసి గ్రామంలోని మెయిన్ సెంటర్ వరకూ కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది, పలువురు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



తోపుడు బండిని అందిస్తున్న గౌరీశంకర్, టీం సభ్యులు

యంగ్‌జనరేషన్ సేవలు అభినందనీయం

● జనసేన నాయకుడు గౌరీశంకర్

తెనాలి రూరల్, ఆగస్టు 18: యంగ్ జనరేషన్ పేదల కోసం అందిస్తున్న సేవలు అభినందనీయమని జనసేన నాయకులు హరిదాసు గౌరీశంకర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని లింగారావు సెంటర్‌కు చెందిన వృద్ధ దంపతులు నాగేశ్వరరావు, లక్ష్మిలకు చిరువ్యాపారం నిర్వహించుకునేలా తోపుడు బండిని యంగ్‌జనరేషన్ టీం సౌజన్యంతో అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన హరిదాసు గౌరీశంకర్ మాట్లాడుతూ వృద్ధ దంపతులు ఆకుకూరలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఇటీవల కాలంలో కుమారుడు రైలు ప్రమాదంలో మృతి చెందగా, కుమార్తె క్యాన్సర్ వ్యాధితో మృతి చెందిందన్నారు. నా అనే వారు లేక ఆకుకూరల వ్యాపారం చేసుకుంటున్నారని వారికి యంగ్‌జనరేషన్ టీం తోపుడుబండి సమకూర్చి వారికి అండగా నిలిచారని తెలిపారు. కార్యక్రమంలో యంగ్ జనరేషన్ టీం అధ్యక్షుడు సాదిక్, సుబ్రహ్మణ్యం, శివ, కౌసిక్, ఆలపాటి సాయి తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసులు దాడి

తెనాలి రూరల్, ఆగస్టు 18: పేకాట స్థావరంపై రూరల్ పోలీసులు దాడులు జరిపారు. ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని సోమసుందపాలెం శివారుల్లో జోరుగా పేకాట ఆడుతున్నారని అందిన సమాచారంతో దాడులు జరిపామన్నారు. అక్కడ పేకాడుతున్న పదిమందిని అదుపులోకి తీసుకుని వారివద్ద రూ.27,200 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

సెప్టెంబరు 1 నుంచి ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనాలు

తెనాలి అర్బన్, ఆగస్టు 18: సెప్టెంబరు 1 నుంచి ఏఐటీయూసీ జాతీయ సమితి సమ్మేళనాలు విశాఖపట్నంలో జరుగుతాయని సంఘ జిల్లా అధ్యక్షుడు ఎ.అరుణ్‌కుమార్ తెలిపారు. గాంధీనగర్‌లో ఆదివారం పోస్టర్లు ఆవిష్కరించారు. ఉపాధ్యక్షుడు గురుబ్రహ్మం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, కార్మిక, కర్షక ప్రజా సంఘాలు సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని కోరారు. మూడు రోజుల పాటు జరిగే సమ్మేళనంలో జాతీయ నాయకులు ప్రసంగిస్తారని తెలిపారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయకుండా అడ్డుకోవాలని పేర్కొన్నారు. విజయ్‌కుమార్, బొల్లిముంత కృష్ణ, పరుచూరి వెంకటేశ్వరరావు, మహేష్, రాజేష్‌కన్నా, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో సుబ్రహ్మణ్య కవి ద్విశతావధానం

తెనాలి అర్బన్, ఆగస్టు 18: తెనాలికి చెందిన సాహిత్యవేత్త పాతూరి సుబ్రహ్మణ్య కవి శ్రీశైలంలో జరిగిన ద్విశతావధానంలో పాల్గొన్నారు. శ్రావణమాసం పురస్కరించుకుని ఐదు రోజుల పాటు నిర్వహించిన అవధానం ఆదివారం ముగిసింది. సమస్య, దత్తపది వర్ణనాంశములలో ఆయన ప్రుచ్ఛకుడిగా వ్యవహరించారు. తెలుగు భాషాభివృద్ధికి అవధానం దోహదపడుతుందని ఇందుకోసం కార్యక్రమం శ్రీశైలం అధికారులు ఏర్పాటు చేశారని తెలిపారు. ఈవో పెద్దిరాజు, శ్రీశైల ప్రభ సంపాదకులు గణేష్, సుబ్రహ్మణ్య కవిని ఘనంగా సన్మానించారు.

21న డీఎస్సీ అభ్యర్థులకు అవగాహన సదస్సు

తెనాలి అర్బన్, ఆగస్టు 18: డీఎస్సీ రాయనున్న అభ్యర్థులకు ఈ నెల 21న అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని యూటీఎఫ్ నాయకులు తెలిపారు. కొత్తపేట ఎన్జీవో కల్యాణ మండపంలో నిర్వహించే సదస్సులో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పరీక్ష, విధి విధానాలు, సిలబస్, ఎలా చదవాలి అనే అంశాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం కూడా పరీక్షలపై విధి విధానాలు వివరిస్తారు. విద్య మనోవిజ్ఞాన శాస్త్ర పుస్తకాన్ని ఉచితంగా అందిస్తారు. యూటీఎఫ్, జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే సదస్సు జయప్రదం చేయాలని ఎండీ గయాసుద్దౌలా, మల్లేశ్వరరావు తెలిపారు.

ప్రమాదభరితంగా మున్నంగి-చినకరకట్ట రోడ్డు

● పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు



కొల్లిపర వంతెన సమీపంలో కోతకు గురైన చిన కరకట్టరోడ్డు

కొల్లిపర, ఆగస్టు 18: మండల పరిధిలోని పిడపర్తిపాలెం నుంచి మున్నంగి వెళ్లే రేపల్లె కాల్వకు అనుకుని ఉన్న చిన కరకట్ట రోడ్డు చెట్లతో పూర్తిగా మూసుకుపోయింది. రోడ్డుకు ఇరువైపులా ముళ్ళచెట్లు పెరిగి పొదల మాదిరిగా ఉండటంతో వాహనదారులు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. వాహనాలపై ప్రయాణించే వారికి ముళ్లచెట్ల కొమ్మలు తగలటంతో గాయాలవుతున్నాయి. ఈ విషయాన్ని అనేక పర్యాయాలు ఇరిగేషన్ అధికారులకు తెలియజేసినా పట్టించుకోకపోవడంతో వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముళ్ళచెట్లు కారణంగా వాహనాలపై ప్రయాణం చేయాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. ముళ్లచెట్లు గుబురుగా మారటంతో పిడపర్తిపాలెం నుంచి మున్నంగి వెళ్ళాలంటేనే మహిళలు భయాందోళనకు గురవుతున్నారు. ఇదిలా ఉంటే కొల్లిపర సమీపంలో రేపల్లె కాల్వపై ఏర్పాటుచేసిన వంతెన దగ్గర చినకరకట్ట రోడ్డు కోతకు గురైంది. చినకరకట్టపై వాహనాల రద్దీ పెరగటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందేమోనని రైతులు, ప్రజలు భయపడుతున్నారు. కరకట్ట రోడ్డు కోతకు గురై ఐదు సంవత్సరాలవుతున్నా ఇరిగేషన్ అధికారుల్లో ఎలాంటి చలనం లేదని కొల్లిపర గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. రాత్రి సమయాల్లో కోతకు గురైన రోడ్డు కనిపించకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని రైతులు తెలియజేస్తున్నారు. రోడ్డు కోతకు గురైన చోట ఇరిగేషన్ అధికారులు ఎటువంటి హెచ్చరికలు సంబంధించిన బోర్డులు పెట్టకపోవడంతో రైతులు అధికారులపై మండిపడుతున్నారు. ఇప్పటికైన ఇరిగేషన్ అధికారులు స్పందించి ముళ్లచెట్ల కొమ్మలను వెంటనే తొలగించాలని, కోతకు గురైన కరకట్ట రోడ్డును మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామస్థులు, వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.



చెట్లతో మూసుకుపోయిన పిడపర్తిపాలెం నుంచి మున్నంగి వెళ్లే చినకరకట్ట రోడ్డు

రైతుల సమస్యలపై తక్షణమే స్పందిస్తాం

ఖాజీపేటలో జరిగిన ప్రత్యేక సమావేశంలో తహసీల్దార్ గోపాలకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ గోపాలకృష్ణ, సాగునీరు వస్తున్న కాలువలను పరిశీలిస్తున్న తహసీల్దార్

తెనాలి రూరల్, ఆగస్టు 18: రైతులకు సమస్యలు ఉత్పన్నమైతే నేరుగా తహసీల్దార్‌కు తెలపవచ్చని అందుకు ప్రతి గ్రామంలో ఉన్న పంచాయతీ, సచివాలయాల్లో తన ఫోన్ నెంబరు ఏర్పాటు చేయిస్తానని తహసీల్దార్ గోపాలకృష్ణ రైతులకు తెలిపారు. మండలంలోని ఖాజీపేట కమ్యూనిటీ హాల్లో ఆదివారం తహసీల్దార్ గోపాలకృష్ణ, ఇరిగేషన్ ఇతర శాఖల అధికారులు కలిసి రైతులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రైతుల నుంచి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలువురు రైతులు తమ పంటలకు సకాలంలో నీరు అందించాలని కోరారు. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో కాలువలు పూడికతీయక అవి పూడిపోయి నీరుపారుదల తగ్గిందన్నారు. వీటికి తోడు ఆ కాలువల్లో గడ్డిజాతి మొక్కలు పెరిగి పారుదల అయ్యే కాస్తనీరుకూడా వచ్చే పరిస్థితి లేకుండా పోయిందని వాపోయారు. అధికారులు తాము తెలిపిన సమస్యలపై దృష్టి పెట్టి వాటిని సరిచేసి సకాలంలో నీరు విడుదల చేస్తే రైతుల నీటి ఎద్దడి తీర్చినవారవుతారని పలువురు విన్నవించారు. గతంలో తాము ఎదుర్కొంటున్న సమస్యలపై ఇరిగేషన్ ఏఈ విద్యావతిని కలిసి పలుమార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని ఆరోపించారు. తహసీల్దార్ గోపాలకృష్ణ మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను తనకు తెలపవచ్చన్నారు. అందుకు మండల గ్రామాల్లోని ప్రతి పంచాయతీ, సచివాలయాల్లో తన ఫోన్ నెంబరు ఏర్పాటుచేయిస్తానన్నారు. దాని ద్వారా తన దృష్టికి తీసుకవచ్చిన ప్రతి సమస్యను సంబంధిత శాఖ అధికారులకు తెలిపి పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఇరిగేషన్ ఎస్ఈ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ గతంలో రైతుల సమస్యలు పట్టించుకోలేదన్న ఫిర్యాదులతో ఇరిగేషన్ ఏఈ విద్యావతి మరో ప్రాంతానికి బదిలీచేసి నూతన ఏఈగా వెంకటేశ్వర్లును నియమించడం జరిగిందన్నారు. రైతులు సాగునీటికోసం తెలిపిన ప్రతి సమస్యను త్వరితగతిన పరిష్కరించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. డీఈ ప్రసాద్, ఈఈ వెంకటరత్నం రూరల్ సీఐ బెల్లం శ్రీనివాసరరావు, ఎస్ఐ కోటేశ్వరరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జాన్, వీఆర్వో సురేష్ పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

కాలువల్లో నీరు వదలడంతో రైతుల్లో ఆనందం

తమ పంట పొలాలు ఎండిపోయి పైర్లు దెబ్బతింటున్నాయని శనివారం మండలంలోని కొలకలూరు శివారులోని ప్రధాన రోడ్డుపై రైతులు నిరసన తెలిపారు. తహసీల్దార్ గోపాలకృష్ణ రైతుల వద్దకు వచ్చి 24 గంటల్లో నీరు అందేలా చూస్తామని వాగ్దానం చేశారు. దీని ప్రకారం నీటిని విడుదల చేశారు. దీంతో రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. కాలువల నుంచి పంట పొలాలకు నీరందించే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. రైతులకు కాలువల ద్వారా నీరు అందుతున్న తీరును ఆదివారం రైతులతో కలసి తహసీల్దార్ గోపాలకృష్ణ, ఇరిగేషన్ అధికారులు పరిశీలించారు. రైతాంగానికి ఎక్కడా కూడా నీటి ఎద్దడిలేకుండా చూస్తామని రైతులకు తెలిపారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన పెంచేందుకు శిక్షణ తరగతులు

● సీపీఎం కార్యదర్శి కొల్లిపర బాబుప్రసాద్

తెనాలి అర్బన్, ఆగస్టు 18 : పార్టీ క్యాడర్‌లో అవగాహన పెంచేందుకు శిక్షణ తరగతులు దోహదపడతాయని సీపీఎం కార్యదర్శి కొల్లిపర బాబుప్రసాద్ చెప్పారు. చెంచుపేట ప్రజా సంఘాల కార్యాలయంలో ఆదివారం కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. ప్రజా సమస్యలపై చురుకుగా పోరాడటానికి చేయాల్సిన విధి విధానాలు వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబించే ప్రజా వ్యతిరేక విధానాలను అవగాహన చేసుకోవాలన్నారు. తద్వారా కార్మికుల్లో, ప్రజల్లో చైతన్యాన్ని తెచ్చి పోరాటం చేయవచ్చని చెప్పారు. భవన్నారాయణ, హుస్సేన్‌వలి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ములకా శివసాంబిరెడ్డి

పాడిరైతులకు ప్రోత్సాహం అందించాలి

● రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శివసాంబిరెడ్డి

తెనాలి రూరల్, ఆగస్టు 18: ప్రభుత్వం, ప్రభుత్వరంగ సంస్థలు పాడిరైతులను ప్రోత్సహించేలా చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఐతానగర్ ఎర్రబడి సెంటర్‌లో మేకల అనసూయ అధ్యక్షతన పశుపోషకదారులతో సమావేశం నిర్వహించారు. శివసాంబిరెడ్డి మాట్లాడుతూ పాడి, పంట రైతులకు రెండుకళ్ల లాంటివన్నారు. పంట దెబ్బతింటే పాడి మీద అయినా కుటుంబాన్ని పోషించుకోవచ్చన్న ఆశతో రైతులు ఉన్నారని చెప్పారు. అయితే పాడి రైతులు పశువుల పోషణకు ఎండుగడ్డి, పచ్చిగడ్డి, తవుడు, దాణా వంటి అన్నింటికి ధరలు పెరగడంతో వాటి పోషణ భారంగా మారిందన్నారు. ప్రభుత్వం పాడిరైతులను దృష్టిలో పెట్టుకుని వారిపై పోషణ భారం పడకుండా ప్రోత్సహించేలా చర్యలు చేపట్టాలని శివసాంబిరెడ్డి డిమాండ్ చేశారు. మాన్యం శ్యాం మాట్లాడుతూ గోకులం, మినీ గోకులం పథకాల కింద షెడ్లు, దోమతెరలు, సబ్సిడీ మీద పశుపోషణ ఉత్పత్తులను అందించాలని కోరారు. సీహెచ్ మార్తమ్మ, జి.అరుణ, మేకల ప్రకాష్, అత్తోట సరోజనీ, జి.సునీత, ఝాన్సీ, పలువురు మహిళలు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలతో నల్లపాడు సీఐ వంశీధర్

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

గుంటూరు, ఆగస్టు 18: ద్విచక్ర వాహన చోరీలకు పాల్పడుతున్న గట్టుపల్లి ప్రదీప్ అనే వ్యక్తిని నల్లపాడు పోలీసులు అరెస్టు చేశారు. చిలకలూరిపేట టౌన్‌లోని క్రిష్టియన్ పేటకు చెందిన గట్టుపల్లి ప్రదీప్ అనే యువకుడు మద్యం, సిగరెట్లు వంటి చెడు అలవాట్లకు బానిసై తక్కువ సమయంలోనే డబ్బులు బాగా సంపాదించాలనే ఉద్దేశంతో కొంత కాలం గా గుంటూరు రూరల్ ప్రాంతంలో ద్విచక్ర వాహన దొంగతనాలకు పాల్పడ్డాడు. ఈ క్రమంలో పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు ప్రదీప్‌ను చిలకలూరిపేట రోడ్డులోని జంక్షన్ దగ్గర అదుపులోకి తీసుకొని అతని నుంచి మొత్తం ఆరు లక్షల 50 వేల ఖరీదైన 8 స్కూటీలను స్వాధీన పరుచుకొని నిందితుడిని రిమాండు నిమిత్తం కోర్టుకు హాజరుపరిచారు.

తెనాలి - సంగంజాగర్లమూడి రోడ్డులో చోరుల భయం

తెనాలి రూరల్, ఆగస్టు 18: తెనాలి నుంచి అంగలకుదురు - సంగంజాగర్లమూడి మధ్య ప్రధాన రోడ్డుపై రాత్రుళ్ల చోరుల భయం వెన్నాడుతోంది. ఒంటిరిగా ద్విచక్రవాహనాలపై రావాలంటే ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. గత కొంత కాలంగా ఈ రోడ్డుపై గుర్తుతెలియని వ్యక్తులు రాత్రుళ్ల ఒంటరిగా వాహనం నడుపుతూ వస్తున్న వారిని ద్విచక్రవాహంతో వెంబడిస్తున్నారు. వాహనదారుల వద్ద నగదు, బంగారం, ఖరీదైన సెల్‌ఫోన్స్, ద్విచక్రవాహనాలను సైతం వదలడంలేదు. శనివారం రాత్రి ఓ ఫొటోగ్రాఫర్ మ్యారేజ్ ఈవెంట్ ముగించుకుని రాత్రి1.30 సమయంలో వస్తుండగా అంగలకుదరు - సంగంజాగర్లమూడి రహదారి మధ్య అతడిని ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు వెంబడించి దాడికి ప్రయత్నించగా చాకచక్యంగా తప్పించుకున్నాడు. పోలీస్ అధికారులు రాత్రుళ్ల పెట్రోలింగ్ నిర్వహిస్తూ వాహనదారులకు రక్షణగా నిలవాలని పలువురు కోరుతున్నారు.

24న గిరిరాజు కృష్ణమూర్తి స్మారక రాష్ట్ర క్యారమ్ పోటీలు

గుంటూరు (తూర్పు), ఆగస్టు 18: ఆంధ్ర స్టేట్ అసోసియేషన్, పల్నాడు జిల్లా క్యారమ్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 24, 25 తేదీల్లో సీఆర్ క్లబ్, చిలకలూరిపేటలో గిరిరాజు కృష్ణమూర్తి స్మారక 2వ ర్యాంకింగ్ క్యారమ్ పోటీలు నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ జలీల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు పేర్లను ఈ నెల 20వ తేదీలోపు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 99511 15678ను సంప్రదించాలని సూచించారు.

సమష్టి కృషితో.. క్రికెట్ అభివృద్ధి

● ఏసీఏ నూతన అధ్యక్షుడు కేశినేని శివనాథ్(చిన్ని)



కేశినేని శివనాథ్ (చిన్ని)ని సత్కరిస్తున్న టీడీపీ నాయకులు కనపర్తి, జిల్లా క్రికెట్ అసోసియేషన్ సభ్యులు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 18: జిల్లా క్రికెట్ అసోసియేషన్లతో కలిసి రాష్ట్రంలో క్రికెట్‌ను మరింతగా అభివృద్ధి చేయనున్నట్టు విజయవాడ ఎంపీ, ఆంధ్రా క్రికెట్ సం ఘం (ఏసీఏ) నూతన అధ్యక్షుడు కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. గుంటూరు, బ్రాడీపేట, జిల్లా క్రికెట్ కార్యాలయంలో ఆదివారం అసోసియేషన్ సభ్యులను స్థానిక టీడీపీ నాయకులతో కలిసి ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. ఏసీఏ నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన నేపథ్యంలో జిల్లా అసోసియేషన్ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కేశినేని చిన్ని మీడియాతో మాట్లాడుతూ ఏసీఏలో రాజకీయాలు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంలో పాలకవర్గ సభ్యులు చేసిన అవకతవకలపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఏసీఏలో క్లీన్ క్రికెట్‌కు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నూతన పాలకవర్గంతో ఏసీఏ కొత్త స్వరూపాన్ని సంతరించుకుంటుందని అన్నారు. క్రీడాకారుల ప్రతిభ తప్ప ఇతర సిఫా ర్సులను ఒప్పుకోమని తెలిపారు. ప్యానల్‌లో ఉన్న 35 మంది సభ్యులు క్రికెట్ అభి వృద్ధికి పాటుపడుతామని హామీ ఇచ్చారు. మంగళగిరిలో ఉన్న అంతర్జాతీయ క్రికెట్ మైదానంను అభివృద్ధి చేసి త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. గుంటూరులో స్థలంను అందజేస్తే నూతన స్టేడియం నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. అనంతరం జిల్లా క్రికెట్ అసోసియేషన్ సభ్యులు కేశినేని చిన్నిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు రమణమూర్తి, కార్యదర్శి రమేష్, సభ్యులు రామకృష్ణ పరమహంస, నాగరాజు. సీతాపతి, టీడీపీ నాయకులు కనపర్తి శ్రీనివాసరావు, చిట్టాబత్తుని చిట్టిబాబు, కొమ్మినేని కోటేశ్వరరావు, నూకవరపు బాలాజీ, గోళ్ల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



పిచ్చి చెట్ల మధ్య ఉన్న పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణం

నిరుపయోగంగా పాఠశాల తరగతి గదులు

పొన్నూరు టౌన్, ఆగస్టు 18: పొన్నూరు పట్టణంలోని భవనగర్ కాలనీలో నిర్మించిన పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణాలు నిరుపయోగంగా మారి శిథిల స్థితికి చేరుకున్నాయి. పొన్నూరు పట్టణంలోని భవనగర్ కాలనీ ఫైర్‌స్టేషన్ సమీపంలోని కాల్వ కట్టువపై 2009కి ముందు డీపీఈపీ నిధులతో పాఠశాల అదనపు తరగతి గదులను నిర్మించారు. కాల్వ కట్టవాసులకు చెందిన చిన్నారులు సుదూర ప్రాంతాలకు వేళ్లే ఇబ్బంది పడకుండా వారికి సమీపంలోనే ఈ పాఠశాల తరగతి గదులను నిర్మించారు. అయితే ఆ నాటి నుంచి ఈ భవన అలన పాలన ఎవ్వరూ పట్టించుకోకపోవటంతో కాలక్రమేణా శిథిల స్థితికి చేరుకుంటోంది. ఈ భవన ప్రాంగణం మొత్తం పిచ్చి చెట్లు పెరిగిపోయి చిట్టడివిని తలపిస్తోంది. చెత్త చెదారాలు ఈ భవన ప్రాంగణంలో పేరుకుపోవటంతో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఖాళీగా ఉన్న భవనంలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. భవనం శిథిల స్థితికి చేరుకోవటంతో అందులో చేరిన విషసర్పాలు జనావాసాల్లోకి వస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లక్షలాది రూపాయల ప్రజాధనంలో నిర్మించిన ఈ భవనం ఎందుకు పనికిరాకుండా పోవటమే కాకుండా శిథిలస్థితికి చేరుకోవటానికి సంబంధిత శాఖల అధికారుల నిర్లక్ష్యమే కారణం అని స్థానికులు ఆరోపిస్తున్నారు. భవనం వలన ఉపయోగం లేకపోతే లక్షలాది రూపాయల వ్యయంతో ఎందుకు నిర్మించారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆ భవనాన్ని శుభ్రం చేయటంతోపాటు, ఏదో ఒక ప్రభుత్వ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి వినియోగించుకోవాలని పలువురు కోరుతున్నారు.



నిడుబ్రోలులో ప్రత్యేక వాహనంపై ఊరేగుతున్న శ్రీఢిల్లీ పోలాక్షమ్మ తల్లి, ఊరేగింపు సందర్భంగా ఆకట్టుకున్న దేవతా వేషధారులు

భక్తి శ్రద్ధలతో పోలాక్షమ్మ కొలుపులు

పొన్నూరు టౌన్, ఆగస్టు 18: పొన్నూరు పట్టణంలోని నిడుబ్రోలులోని శ్రీఢిల్లీ పోలాక్షమ్మ కొలుపులు ఆదివారం భక్తి శ్రద్ధలతో జరిగాయి. అమ్మవారి కొలుపులను పురస్కరించుకుని ఉదయం ఆలయంలో యువకులు జలాభిషేకాలు జరిగాయి. అనంతరం పంచామృత అభిషేకాలను నిర్వహించారు. వర్షాలు కురవాలని, గ్రామంలోని మహిళలు అమ్మవారికి పొంగళ్లను నైవేద్యంగా సమర్పించారు. రైతులు తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన సింహ వాహనంపై అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రతిష్ఠించి గ్రామోత్సవాన్ని జరిపారు. గ్రామోత్సవం సందర్భంగా యువకుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కనక తప్పెట్లు, సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. దేవతామూర్తుల అలంకరణలో ఏర్పాటు చేసిన వేషధారులను చూసేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారి ఉత్సవాన్ని తిలకించేందుకు నిడుబ్రోలు పరిసర ప్రాంతానికి చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు.



గ్రామ దేవతకు జలాభిషేకాలు చేసిన చిన్నారులు

గ్రామ దేవతకు జలాభిషేకాలు

పొన్నూరు టౌన్, ఆగస్టు 18: వర్షాలు సమృద్ధిగా కురవాలని, పాడి పంటలతో గ్రామం విలసిల్లాలని కోరుతూ ఆదివారం గ్రామ దేవతకు చిన్నారులు, యువత జలాభిషేకాలు నిర్వహించిన సంఘటన మండల పరిధిలోని చింతలపూడి గ్రామంలో చోటు చేసుకుంది. చింతలపూడి గ్రామంలోని గ్రామ దేవత శ్రీ మెంట్లమ్మ తల్లి అమ్మవారికి ప్రతి ఏట శ్రావణ మాసంలో మూడు ఆదివారాలు జలాభిషేకాలు నిర్వహించి చివరివారం అమ్మవారికి జాతర నిర్వహించటం అనవాయితీగా వస్తుంది. శ్రావణమాసం 2వ ఆదివారం పురస్కరించుకుని గ్రామంలోని యువత, చిన్నారులు ఆలయం వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకుని అమ్మవారికి బిందెలతో జలం తీసుకొచ్చి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి మంగళస్నానాలు చేయించి ప్రభల ఉత్సవం జరిపారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలలో పాల్గొని అమ్మవారికి పొంగళ్లను నైవేద్యంగా సమర్పించారు.

మైనర్‌లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే జైలుకే

● ద్విచక్ర వాహన చోదకులకు భారీగా జరిమానాలు

గుంటూరు, ఆగస్టు 18: మైనర్‌లు వాహనాలు నడుపుతూ మరోసారి పట్టుబడితే ఈ సారి జైలుకు వెళ్లడమేనని నల్లపాడు సీఐ వంశీధర్ హెచ్చరించారు. పోలీసులు ఆకస్మికంగా నిర్వహించిన నాకాబందీలో నిబంధనలకు విరుద్ధంగా నడుపు తూ పట్టుబడిన ద్విచక్ర వాహన చోదకులకు భారీ మొత్తంలో జరిమానాలు విధించారు. శనివారం సాయంత్రం పోలీసులు నిర్వహించిన నాకాబందిలో సరైన పత్రాలు లేని 198 ద్విచక్ర వాహనాలను నల్లపాడు పోలీ సులు సీజ్ చేసిన విషయం విదితమే. సీజ్ చేసిన వాహనాలను పోలీస్ పెరెడ్ గ్రౌండ్‌కు తరలించారు. ఎనిమిది బృందాలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్టు నల్లపాడు సీఐ వంశీధర్ తెలిపారు. వాహన చోదకులకు, వారి తల్లిదండ్రులకు నల్లపాడు సీఐ వంశీధర్ కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం పెద్ద మొత్తంలో ఆయా వాహన చోదకులకు ఆర్టీఏ అధికారులు జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా వంశీధర్ మాట్లాడుతూ ప్రతి వారం ఆకస్మికంగా నాకాబందీ నిర్వహిస్తామన్నారు.